
01-04-2025
మంగళవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 191 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB
జయభేరి







## ఘనంగా ఈద్ పండుగ



✍ జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 31:

దేశవ్యాప్తంగా ఈద్ పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద మోదీ దేశ ప్రజలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ X లో "ఈద్‌ఉల్‌ఫితర్ శుభాకాంక్షలు" అని ప్రధాని మోదీ ఒక పోస్ట్ రాశారు. ఈ పండుగ మన సమాజంలో ఆశ, సామరస్యం, దయ స్ఫూర్తిని పెంపొందించుగాక అంటూ ప్రధాని మోదీ పేర్కొన్నారు. "మీ అన్ని ప్రయత్నాలలో ఆనందం, విజయం పొందాలి, ఈద్ ముబారక్!" అంటూ ప్రధాని పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ మాసం తర్వాత ఈద్‌ఉల్‌ఫితర్ జరుపుకుంటారు. ఇది ముస్లింలకు ప్రత్యేకమైన రోజు. ఆదివారం దేశంలో ఈద్

...మిగతాది 2 లో



## నేను జోక్ చేయడం లేదు

- మూడోసారి అధ్యక్షుడయ్యేందుకు మార్గాలున్నాయ్ : డొనాల్డ్ ట్రంప్

✍ జయభేరి, న్యూ డిల్లీ మార్చి 31:

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏం చేసినా సంచలనమే అవుతుంది. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ట్రంప్.. తన పాలన ఎలా ఉంటుందో మరోసారి అందరికీ రుచిచూపిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన మూడోసారి కూడా అమెరికా అధ్యక్షుడు కావాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. తాను మూడోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి మార్గాలున్నాయని ఓ న్యూస్ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో

...మిగతాది 2 లో





> నగరంలోని హెచ్‌సియు వద్ద 400 ఎకారల భూమి తమదేనని ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. 400 ఎకారల భూమి వివాదంపై నిరసనలు తలెత్తిన వేళ టిజిఐఐసి కీలక ప్రకటన చేసింది. ప్రాజెక్టులో సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన భూములు లేవని స్పష్టం చేసింది. ఆ భూమి యజమాని తామేనని న్యాయస్థానంలో ప్రభుత్వం నిరూపించుకుంది. ఓ ప్రైవేటు సంస్థకు 21 ఏళ్ల క్రితం కేటాయించిన భూమిని న్యాయ పోరాటం ద్వారా దక్కించుకున్నట్లు వెల్లడించింది. వేలం, అభివృద్ధి పనులు అక్కడి రాళ్లను దెబ్బ తీయవని తెలిపింది. అభివృద్ధికి ఇచ్చిన భూమిలో చెరువు లేదని సర్వేలో ఒక్క అంగుళం భూమి కూడా హెచ్‌సియుది కాదని పేర్కొంది. కొందరు విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పుకొచ్చింది.

# 400 ఎకరాలు ప్రభుత్వానివే

✍ జయభేరి, హైదరాబాద్, మార్చి 31 :

కంచె గచ్చిబౌలిలోని ఆ 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదే, ప్రాజెక్టులో సెంట్రల్ యూనివర్సిటీ భూమి లేదు అని TGIIC స్పష్టం చేసింది. ఆ భూమి యజమాని తానేనని న్యాయస్థానం ద్వారా తెలంగాణ ప్రభుత్వం నిరూపించుకుంది. ప్రైవేటు సంస్థకు 21 ఏళ్ల క్రితం కేటాయించిన భూమిని న్యాయపోరాటం ద్వారా ప్రభుత్వం దక్కించుకుందని సోమవారం మరో ప్రకటన విడుదల చేసింది. వేలం... అభివృద్ధి పనులు అక్కడ ఉన్న రాళ్లను దెబ్బతీయవు.. అభివృద్ధికి ఇచ్చిన భూమిలో చెరువు లేదు అని స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాలపై యాజమాన్యం తనదేనని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. 2004లో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రైవేటు సంస్థకు ఈ భూమిని కేటాయించింది.

...మిగతాది 2 లో




## హిందుత్వ భావజాల విస్తరణే ప్రధాన లక్ష్యం

2 లో

## ఉగాది పురస్కారాలు నంది అవార్డ్- 2025

4 లో



## చంద్రబాబు సొంత ఇల్లు


- 9న శంకుస్థాపన

✍ జయభేరి, విజయవాడ, మార్చి 31:

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అమరావతిలో భూమి కొనుగోలు చేశారు. వెలగపూడికి సమీపంలో E6 రోడ్‌లో ఐదు ఎకరాల భూమిని ఆయన కొంతకాలం క్రితం కొన్నారు. ఏప్రిల్ 9న అక్కడ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేయబోతున్నారు. ఏప్రిల్ 15 తర్వాత అమరావతి పనుల నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభం కాబోతున్నాయి. ఆరేళ్లగా ఆగిపోయిన ఈ పనులకు ప్రధాని మోదీ మరోసారి

...మిగతాది 2 లో

## గ్రూప్1 మెయిన్స్ ఫలితాల్లో సత్తాచాటిన మహిళలు



✍ జయభేరి, హైదరాబాద్, మార్చి 31 :

తెలంగాణలో 563 గ్రూప్1 పోస్టులకు సంబంధించిన జనరల్ ర్యాంకు జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మార్చి 30న విడుదల చేసిన సంగతి తెలిసిందే. గ్రూప్1 మెయిన్స్‌లో ఏడు పేపర్లకు హాజరైన అభ్యర్థుల ప్రాథమిక మార్కుల జాబితాను మార్చి 10న వారి వ్యక్తిగత లాగిన్‌లలో టీజీపీఎస్సీ పొందుపర్చి, అభ్యర్థుల నుంచి మార్చి 24 వరకు రీకౌంటింగ్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. పునఃలెక్కింపు ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో.. పరీక్షకు హాజరైన 21,085 మంది అభ్యర్థుల మార్కులను తాజాగా ప్రకటించింది. అర్హత పరీక్ష ఇంగ్లిష్‌తో పాటు ప్రధాన పరీక్షలైన ఆరు పేపర్ల మార్కులను వెల్లడించింది. జీఆర్‌ఎల్‌లో మార్కులు, పోస్టుల సంఖ్య, రిజర్వేషన్ల ఆధారంగా 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ఎంపిక చేస్తామని కమిషన్ వెల్లడించింది. గ్రూప్1 మెయిన్ పరీక్షలను గతేడాది అక్టోబరు 21 నుంచి 27 వరకు నిర్వహించారు. ఈ ఫలితాల్లో మహిళలు సత్తాచాటారు. తొలి వంద ర్యాంకుల్లో 41 మంది మహిళలు ఉండటం విశేషం. అందులోనూ టాప్10లో ఆరుగురు, టాప్50లో 25 మంది మహిళలు ఉన్నారు. ప్రధాన పరీక్షల్లో (అర్హత పరీక్ష ఇంగ్లిష్ మినహా) 500కి పైగా మార్కులు సాధించిన అభ్యర్థులు 52 మంది ఉన్నారు. టాప్ 3 ర్యాంకరుతో పాటు టాప్100లో ఐదుగురు తెలంగాణ స్థానికేతర

...మిగతాది 2 లో



## సీఎం గారు మీకు మానవత్వం లేదా

### జుట్టు పట్టుకుని గొడ్డులాగా బాదుతారా..? కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

✍ జయభేరి, హైదరాబాద్ :

**అప్పులు తెచ్చి భూములమ్మితే తప్ప పాలించే పరిస్థితి లేదా.. ఆ మాత్రానికి మీరెందుకు.. కేఏ పాల్ కు అప్పగించినా అదే పనిచేస్తారు కదా, ఇంత జరుగుతుంటే విద్యా కమిషన్ ఏం చేస్తోంది. వాళ్ల నోళ్లెందుకు మూతపడ్డాయి, హెచ్ సీయూ ఘటనపై తక్షణమే విచారణ జరపాలి.. బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలి.**

**సన్నబియ్యం కార్యక్రమంలో ప్రధాని ఫోటో ఏది?**

రేషన్ బియ్యం ఖర్చులో రూ.10 వేల కోట్లకుపైగా ఖర్చు చేసేది కేంద్రమే.. రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2 వేల కోట్లు మాత్రమే, కిలోకు రూ.40లు చెల్లిస్తోంది మేమే..

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## గ్రూప్1 మెయిన్స్ ఫలితాల్లో..

అభ్యర్థులు ప్రతిభ చాటారు. గ్రూప్1 ప్రధాన పరీక్షలకు హాజరైన అభ్యర్థుల్లో ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు అధికంగా ఉన్నారు. పరీక్షకు హాజరైన 20,161 మందిలో 12,323 మంది ఆంగ్ల మాధ్యమం.. 7,829 మంది తెలుగు.. 9 మంది ఉర్దూ మాధ్యమ అభ్యర్థులు ఉన్నారు. గ్రూప్1లో సమాన మార్కులు వచ్చిన అభ్యర్థులు ఎక్కువ మంది ఉన్నారు. అలాగే కేవలం 0.5 మార్కుల తేడాతో పలువురు జీఆర్ఎల్‌లో కొన్ని ర్యాంకులు వెనుకబడ్డారు. అభ్యర్థుల వ్యక్తిగత మార్కుల మెమోను వెబ్‌సైట్ వ్యక్తిగత లాగిన్‌లలో పొందుపరిచామని, హాల్‌టికెట్, టీజీపీఎస్సీ ఐడీ, పుట్టిన తేదీ, మొబైల్ నంబరు, ఓటీపీ నమోదు చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. మార్కుల మెమోలు ఏప్రిల్ 5 వరకు వారం రోజుల పాటు, జనరల్ ర్యాంకు జాబితా ఏప్రిల్ 28 వరకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని కమిషన్ తెలిపింది. గ్రూప్1 మెయిన్స్ పరీక్షల్లో మొత్తం 900 మార్కులకు గాను 550 మార్కులతో హైదరాబాద్ ఏఎస్‌రావు నగర్‌కు చెందిన లక్ష్మీదీపిక కొమ్మిరెడ్డి రాష్ట్ర టాపర్‌గా నిలిచారు. మల్టీజోన్2లోనూ ప్రథమ స్థానం సాధించారు. ఆమె ఉస్మానియాలో వైద్యవిద్య పూర్తిచేశారు. సివిల్స్‌కు ప్రిపేర్‌కావడం గ్రూప్1కు కలిసొచ్చిందని, గ్రూప్1కు ఎలాంటి కోచింగ్ తీసుకోలేదని తెలిపింది. 80 శాతం సిలబస్ కామన్‌గా ఉండటంతో సులభమైంది. 20శాతం తెలంగాణ అంశాలను జాగ్రత్తగా ప్రిపేరైనట్లు లక్ష్మీ తెలిపారు. నల్గొండ జిల్లాకు చెందిన దాడి వెంకటరమణ 535.5 మార్కులతో రెండో ర్యాంకు సాధించారు. గత ఆరేళ్లుగా సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమవుతున్న వెంకటరమణ.. గ్రూప్1 మొదటి ప్రయత్నంలోనే సత్తా చాటడం విశేషం. ఆయన తండ్రి శ్రీనివాసరావు నల్గొండలో టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఏఈగా, తల్లి రమాదేవి ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. అమ్మానాన్నల ప్రోత్సాహమే తన విజయానికి ముఖ్య కారణమని వెంకటరమణ తెలిపారు. సమాజ సేవ చేయాలనే ఆకాంక్ష తన లక్ష్యసాధనకు దోహదపడిందని చెప్పారు. ఇంటి వద్దే ఉండి సన్నద్ధమైన ఆయన.. ఇటీవల టీజీపీఎస్సీ ప్రకటించిన జూనియర్ లెక్చరర్ సివిక్స్ పోస్టుకు, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుకు ఎంపికయ్యారు. గ్రూప్2లో 378వ ర్యాంకు సాధించారు. మల్టీ జోన్1 కేటగిరీలో హనుమకొండ జిల్లాకు చెందిన తేజస్విని‌రెడ్డి 532.5 మార్కులతో టాపర్‌గా నిలిచారు. మొత్తం మీద నాలుగో ర్యాంకు సాధించారు. ఆమె ప్రస్తుతం మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడకు చెందిన సిద్ధాల కృతిక గ్రూపు1లో 532 మార్కులతో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు సాధించారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన కృతిక తల్లి సిద్ధాల లావణ్య గతంలో సరూర్ నగర్ మండల పరిషత్ అధ్యక్షురాలిగా పనిచేశారు. తండ్రి బీరప్ప భారాస నాయకుడు. 2017లో డిగ్రీ పూర్తిచేసిన కృతిక.. మొదట సివిల్స్‌కు సిద్ధమయ్యారు. వరుసగా నాలుగుసార్లు పరీక్ష రాసినా మంచి ర్యాంకు రాలేదు. 2022లో గ్రూప్1 నోటిఫికేషన్ రాగా పరీక్ష రాశారు. ర్యాంకు రాకపోవడంతో 2024లో మరోసారి గ్రూప్1, గ్రూప్4 రాశారు. గ్రూప్4లో 511వ ర్యాంకు సాధించి వాణిజ్య పన్నుల శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగంలో చేరారు. తాజాగా గ్రూప్1లో రాష్ట్రస్థాయి ఐదో ర్యాంకు రావడంతో తన ఏడేళ్ల కృషికి ఫలితం దక్కిందని కృతిక సంతోషం వ్యక్తం చేశారు. సివిల్స్‌పై ఇష్టంతో చదివాను. గ్రూప్1 పరీక్షకు ఎలాంటి శిక్షణ తీసుకోలేదు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి చదివాను అని ఆమె తెలిపారు. కృతికకు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వచ్చే అవకాశం ఉన్నట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన పూనాటి రాజ్యలక్ష్మి‌తిరుపతిరావుల కుమారుడైన హర్షవర్ధన్ గ్రూప్1లో రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు, మల్టీ జోన్2 స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించి సత్తాచాటారు. బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. రూ.27 లక్షల వార్షిక వేతనంతో ఓ ప్రైవేట్ సంస్థలో ఏడాది పాటు ఉద్యోగం చేశారు. అనంతరం రాజీనామా చేసి యూపీఎస్సీకి సన్నద్ధమయ్యారు. గతేడాది గ్రూప్1 పరీక్షకు ప్రిపేర్ అయ్యారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం మానసపల్లికి చెందిన దైనంపల్లి ప్రవీణ్ కుమార్ రాష్ట్రస్థాయిలో 105వ ర్యాంకు సాధించారు. ఆయన చిన్నప్పుడే అమ్మానాన్నలు మృతిచెందడంతో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేసే నాయనమ్మలు సమ్మక్క, ఎల్లమ్మలు తోడుగా నిలిచారు. ప్రవీణ్ ఉస్మానియాలో బీటెక్ పూర్తి చేశారు. నాలుగేళ్లుగా బంజారాహిల్స్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉంటూ సివిల్స్‌కు సిద్ధమయ్యారు. తాజాగా గ్రూప్1 ర్యాంకర్‌గా నిలిచారు.

## చంద్రబాబు సొంత ఇల్లు

శంకుస్థాపన చేయబోతున్నారు. దానికంటే ముందుగానే తన సొంత ఇంటి నిర్మాణానికి భూమి పూజ జరిపించాలని చంద్రబాబు భావిస్తున్నారు. రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి చంద్రబాబుపై విపక్షాలు ఎక్కుపెట్టిన ప్రధానమైన విమర్శ ఆయనకు అమరావతిలో సొంత ఇల్లు లేదని. ప్రస్తుతం ఆయన ఉంటున్న ఉండవల్లిలోని నివాసం పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్‌కు చెందినదని వారి ఆరోపణ. అదే సమయంలో వైసీపీ అధ్యక్షుడు తాడేపల్లిలో తన సొంత ఇల్లు నిర్మాణం చేశారు. 2019కి ముందే గృహప్రవేశ కార్యక్రమం కూడా పూర్తి చేశారు. అప్పట్లో వైసిపి ఇదే అంశాన్ని హైలైట్ చేస్తూ అమరావతిలో చంద్రబాబుకు సొంతిల్లు లేదనీ హైదరాబాదులోనే నివాసం ఉంటూ ఇక్కడ రాజకీయాలు నడిపిస్తున్నారంటూ చంద్రబాబును విమర్శించేవారు. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాక ప్రస్తుతం చంద్రబాబు నివాసం ఉంటున్న ఉండవల్లి ఇంటిని ముఖ్యమంత్రి నివాసంగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా వెలగపూడి లోని సెక్రటేరియట్ వెనకాల ఐదు ఎకరాల 20 సెంట్ల భూమిని కొనుగోలు చేశారు. VIT కాలేజీకి దగ్గర్లో ఉన్న ఈ స్థలంలో చంద్రబాబు ఇంటికి సంబంధించిన నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 9న భూమి పూజ చేయడానికి ముహూర్తం నిర్ణయించినట్టు తెలుస్తుంది. ఇప్పటికే ఇంజనీర్లు ఆ స్థలంలోని మట్టిని పరీక్ష చేశారు. అక్కడ ఇంటి నిర్మాణానికి అనువుగా ఉంటుందా లేదా అనే టెస్టులు కూడా పూర్తయ్యాయి. వెలగపూడి సచివాలయానికి, VIT కాలేజీకి, హైకోర్టు మధ్యలో ఉన్న ఈ స్థలం అమరావతి కోర్ క్యాపిటల్‌కి సెంటర్‌గా ఉండబోతుంది. దానితో ఈ ఏరియా రూపు రేఖలే మారిపోతాయని స్థానికులు అంటున్నారు. ఏకంగా ఏపీ ముఖ్యమంత్రి తన సొంత ఇంటి కోసం తమ స్థలాల మధ్యలోనే కొంత ఏరియాను కొనడం అక్కడ ఆయన నివాసం రావడం వల్ల రియల్ ఎస్టేట్ పరంగా కూడా తమ భూములకు మంచి రెట్లు వస్తాయని స్థానిక గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## నేను జోక్ చేయడం లేదు

తెలిపారు. ఈ విషయంలో తాను జోక్ చేయడం లేదని వ్యాఖ్యానించారు. ఇంటర్వ్యూలో భాగంగా మరోమారు అధ్యక్షుడు కావాలనుకుంటున్నారా..? అందుకు ఏమైనా వ్యూహాలున్నాయా..? అన్న ప్రశ్న ట్రంప్‌కు ఎదురైంది. ఇందుకు ఆయన సమాధానమిస్తూ.. 'రాజ్యాంగం అనుమతించకపోయినా.. మూడోసారి అధ్యక్షుడు కావడానికి చాలా మార్గాలు ఉన్నాయి. ఈ విషయంలో నేను జోక్ చేయడం లేదు. నన్ను మూడోసారి కూడా అధ్యక్షుడిగా చూడాలని చాలామంది కోరుకుంటున్నారు. అయితే, దాని గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటే అవుతుంది. ఆ విషయం మీకు కూడా తెలుసు' అని ట్రంప్ పేర్కొన్నారు. నిజానికి అమెరికా రాజ్యాంగం ప్రకారం ఏ వ్యక్తీ రెండుసార్లకు మించి అధ్యక్ష పదవిని అధిష్ఠించడానికి వీల్లేదు. ట్రంప్ మూడోసారి అధ్యక్షుడు కావాలంటే 22వ రాజ్యాంగ సవరణను మార్చాల్సి ఉంటుంది. దానికి అమెరికా కాంగ్రెస్‌తోపాటు రాష్ట్రాల ఆమోదం పొందాల్సి ఉంటుంది. అది చాలా కష్టమైన పని. అమెరికా చరిత్రలో ఫ్రాంక్లిన్ రూజ్ వెల్ట్ ఒక్కరే నాలుగుసార్లు అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఇటువంటిది జరగకుండా నివారించడానికి 1951లో 22వ రాజ్యాంగ సవరణ తెచ్చారు. అయితే, ట్రంప్ మాత్రం మూడోసారి, వీలైతే నాలుగోసారి కూడా అమెరికాను ఏలాలని కలలు కంటున్నారు. మూడోసారి అధ్యక్ష పీఠాన్ని అధిష్ఠించడంపై ఆయన ఇప్పటికే పలు వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓ వ్యక్తి రెండుసార్లకు మించి దేశాధ్యక్ష పదవి చేపట్టేందుకు వీలుగా రాజ్యాంగాన్ని సవరించాలంటూ పాలక రిపబ్లికన్ పార్టీ కాంగ్రెస్ (పార్లమెంటు) సభ్యుడు యాండీ ఓగిల్స్ దిగువ సభలో ఇటీవలే సంయుక్త తీర్మానం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇది ఆమోదం పొందితే డొనాల్డ్ ట్రంప్ మూడుసార్లు అధ్యక్ష పదవికి ఎన్నిక కావడానికి వీలు కలుగుతుంది.

## ఘనంగా ఈద్ పండుగ

చంద్రుడు కనిపించాడు. ఆ తర్వాత సోమవారం ఈద్ పండుగను ఎంతో వైభవంగా జరుపుకుంటున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోషల్ మీడియా 'X' వేదికగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.'ఈద్‌ఉల్‌ఫితర్ శుభ సందర్భంగా దేశ ప్రజలందరికీ, ముఖ్యంగా ముస్లిం సోదరులు, సోదరీమణులకు శుభాకాంక్షలు.' ఈ పండుగ సోదర భావాన్ని బలోపేతం చేస్తుంది. కరుణ, దాతృత్వ స్ఫూర్తిని స్వీకరించే సందేశాన్ని ఇస్తుంది. అంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముస్లిం సోదర, సోదరీమణులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# హిందుత్వ భావజాల విస్తరణే ప్రధాన లక్ష్యం

**ఆర్ఎస్ఎస్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్. ఇప్పుడు తెలంగాణలో విస్తరించడమే టార్గెట్ గా పెట్టుకుంది. ప్రతి గ్రామంలో శాఖ ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. సంఘ్ ఏర్పడి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. ఇటీవలే బెంగళూరులో జరిగిన అఖిల భారతీయ ప్రతినిధి సభలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.**



కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఏం చేయబోతున్నారు? ఎలా విస్తరణకు ప్లాన్ చేశారన్నది ఇంట్రెస్టింగ్ గా మారింది. 1925 సెప్టెంబర్ 27న నాగ్ పూర్ లో ఏర్పాటైంది. ఈ సెప్టెంబర్ 27 వస్తే వందేళ్లు. అంటే శతాబ్ది ఉత్సవాలు ఓ రేంజ్ లో ఉండేలా ప్లాన్ ప్రిపేర్ చేసింది. అంతే కాదు.. విస్తరణ కూడా ఎవరూ ఊహించని వేగంతో చేయాలనుకుంటోంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఈ మాస్టర్ ప్లాన్ అమలు చేయబోతోంది. ఇప్పుడు రాబోయే విజయదశమి రోజున చరిత్ర తిరగరాయాలని ఆర్ఎస్ఎస్ అనుకుంటోంది. తమిళనాడు మొదలుకుని కశ్మీర్ దాకా పథసంచలన్, శోభాయాత్రలు, ఘోష్ ఇవన్నీ చేయబోతున్నారు. ఈ ఏడాది దసరా నుంచి 2026 దసరా మధ్యలో శతాబ్ది వేడుకల కోసం సంఘ్ వేసుకున్న ప్లాన్ ఓ రేంజ్‌లో ఉంది. 1925లో సంఘ్ ప్రారంభమైనప్పటి నుంచీ చాలా సమస్యలు, సవాళ్లను ఎదుర్కొంది. దేశవ్యాప్తంగా మొత్తం 51,570 స్థలాల్లో RSS రోజువారీ శాఖలు 83,129 నడిచేదాకా వెళ్లాయి. నాలుగైదేళ్లుగా శాఖలు, పాల్గొంటున్నవారి సంఖ్య దేశవ్యాప్తంగా పెరిగినట్లు సంఘ్ అంటోంది. గతేడాదితో పోల్చితే 10 వేలకు పైగా కొత్త శాఖలు ప్రారంభమయ్యాయన్నారు తెలంగాణ ప్రాంత కార్యదర్శి కాచం రమేశ్. వీటితో పాటు 32,147 వీక్లీ శాఖలు, 12,091 నెలవారీ శాఖలు నడుస్తున్నాయని, మొత్తంగా అన్నీ కలిపి 1,27,367 శాఖాపరమైన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. గ్రామీణ లేదా పట్టణ ప్రాంతాలలో 10 వేల జనాభా ఉన్న ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. ఆ లెక్కన శాఖలకు ప్లాన్ చేస్తున్నారు. వీటితో పాటే స్లమ్స్‌లో సేవాబస్తీల పేరిట సంఘ్ విస్తరణ ప్రయత్నం చేసుకుంటున్నారు. అంటే హిందూ సొసైటీలో ఏ వర్గాన్ని కూడా పక్కన పెట్టకుండా అందరినీ కవర్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. గతేడాది తెలంగాణలో విజయదశమి వేడుకల సందర్భంగా 161 ప్రదేశాలలో జరిగిన రూట్ మార్చ్‌లలో 50 వేల మందికి పైగా స్వయంసేవకులు పాల్గొన్నారు. ఇందులో 28 వేల మందికి పైగా స్వయం సేవక్స్ సంఘ యూనిఫామ్‌లో పాల్గొన్నారని తెలంగాణ ఆర్ఎస్ఎస్ శాఖ అంటోంది. ఈ సెప్టెంబర్ వస్తే ఆర్ఎస్ఎస్ ఏర్పడి

> “ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా 5 అంశాలపై యూత్ కు ట్రైనింగ్ ఇవ్వాలనుకుంటున్నారు. అందులో సామాజిక సామరస్యం, కుటుంబం, పూర్వీకులు కుల దేవత గురించి స్మరించుకోవడం, పర్యావరణ పరిరక్షణ, మాతృభాషలో మాట్లాడటం, భారతీయ సాంప్రదాయ దుస్తులు వేసుకోవడం, సంస్కృతిని కాపాడడం, ప్రజల బాధ్యతల గురించి తెలిపేలా శిక్షణ ఉండబోతోంది. సంఘ్ వందేళ్ల ఆవిర్భావ వేడుకల్లో భాగంగా RSS ఆలోచనలు, భావాలను సమాజం వద్దకు తీసుకెళ్లేలా వచ్చే నవంబర్ డిసెంబర్‌జనవరి నెలల్లో దేశంలో ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి వెళ్లడానికి జన సంపర్క అభియాన్ కార్యక్రమం జరగబోతోంది.

వందేళ్లు అవుతుంది. మరి ఈ వందేళ్లలో సంఘ్ ఏం చేసింది? నేడు దేశంలో 1 కోటి మందికి పైగా స్వయంసేవకులు ఉన్నారని చెబుతున్న సంఘ్ పెద్దలు ఎలాంటి ఫ్యూచర్ టార్గెట్స్ పెట్టుకున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న సామాజిక సమస్యలపై సంఘ్ ప్లాన్స్ ఎలా ఉన్నాయి? తమ అనుబంధ సంస్థలకు పొలిటికల్ ప్లాట్ ఫామ్ గా ఆరెస్సెస్ శాఖలు ఉపయోగపడుతున్నాయారాజకీయ పార్టీలతో పోలిస్తే ఆర్ఎస్ఎస్ ప్రణాళిక భిన్నంగా ఉంటుంది. హిందుత్వ భావజాల విస్తరణే ప్రధాన లక్ష్యం అయినా సామాజిక అంశాలపై స్పందించడం ద్వారా ప్రజల్లోకి వెళ్లడం సంఘ్ స్పెషాలిటీ. ఈ విషయంలో మరింత పదును పెట్టడం ద్వారా తెలంగాణ పల్లెల్లో జెండా ఎగరేయాలనేది ఆర్ఎస్ఎస్ తాజా ఆలోచన. కేవలం సంఘ్ భావజాల వ్యాప్తే కాదు.. ఇంకొన్ని లక్ష్యాలు కూడా ఇప్పటికే వారు పెట్టుకున్నారు. సామాజిక అంశాలైన ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, మొక్కల పెంపకం, జల సంరక్షణ కార్యక్రమాలు చేపట్టడం, కులాల మధ్య అంతరాల వల్ల హిందుత్వ భావజాలానికి ఇబ్బందిగా మారిందన్న ఉద్దేశంతో ఈ విషయంలో కూడా ఫోకస్ పెంచుతున్నారు. అంతే కాదు.. గ్రామ వికాస కార్యక్రమాల పేరుతో మద్యపానం తగ్గించడం, అక్షరాస్యత పెంపు, మహిళలను గౌరవించడం, వారికి ఆపద వస్తే రక్షణగా నిలబడడం, వలసల నివారణ, సేంద్రియ వ్యవసాయం, గోసంపద వృద్ధి, కుటుంబాల్లో మనస్పర్థలు తగ్గించేలా, వృద్ధులను ఆదరించేలా, పాశ్చాత్య సంస్కృతిపై ఆకర్షణ తగ్గించేలా చేయడం, సోషల్ మీడియా అనర్థాలపైనా కార్యక్రమాల నిర్వహణ ప్రధాన లక్ష్యంగా ఉంది.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా 5 అంశాలపై యూత్ కు ట్రైనింగ్ ఇవ్వాలనుకుంటున్నారు. అందులో సామాజిక సామరస్యం, కుటుంబం, పూర్వీకులు కుల దేవత గురించి స్మరించుకోవడం, పర్యావరణ పరిరక్షణ, మాతృభాషలో మాట్లాడటం, భారతీయ సాంప్రదాయ దుస్తులు వేసుకోవడం, సంస్కృతిని కాపాడడం, ప్రజల బాధ్యతల గురించి తెలిపేలా శిక్షణ ఉండబోతోంది. సంఘ్ వందేళ్ల ఆవిర్భావ వేడుకల్లో భాగంగా RSS ఆలోచనలు, భావాలను సమాజం వద్దకు తీసుకెళ్లేలా వచ్చే నవంబర్‌డిసెంబర్‌జనవరి నెలల్లో దేశంలో ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి వెళ్లడానికి జన సంపర్క అభియాన్ కార్యక్రమం జరగబోతోంది. ఇందులో హిందూ సంస్థలకు భాగస్వామ్యం కల్పించి హిందుత్వాన్ని, ధర్మాన్ని సమాజంలోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తామంటున్నారు సంఘ్ పెద్దలు.

గతేడాది సర్ సంఘచాలక్ మోహన్ భగవత్.. సంఘ్ కార్యకలాపాల విస్తరణ, ఏకీకరణ కోసం 2 ఏళ్లు కేటాయించే కార్యకర్తలను ఆహ్వానించారు. ఈ పిలుపుతో 2,453 మంది స్వయంసేవకులు తమ ఇళ్లు వదిలి పూర్తిస్థాయి సంఘ్ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. అటు సంఘ్ కార్యకలాపాల్లో చేరే యువకుల సంఖ్య పెరుగుతోంది. ప్రతి ఏడాది, లక్షలాది మంది యూత్, ముఖ్యంగా 1425 ఏళ్ల మధ్య వయసున్న వారే సంఘ్ లో చేరుతున్నారంటున్నారు. ఆర్ఎస్ఎస్ అంటే సామాజిక సేవలో ముందుంటుందన్న అభిప్రాయం ఉంది. వరదలు వచ్చినా, భూకంపాలు వచ్చినా, కొండ చరియలు విరిగిపడ్డా.. సమస్య ఏదైనా విపత్తుల్లో సహాయాలు చేస్తూ స్వయం సేవకులు కనిపిస్తుంటారు. ఇలాంటి సేవా కార్యక్రమాల పట్ల యువతలో ఆసక్తి పెంచేలా కార్యక్రమాలు నిర్వహించబోతున్నారు. సమాజానికి సేవ అన్నది ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో ప్రధాన అంశం. ఇటీవల కుంభమేళలోనూ వచ్చిన వారికి కంటి పరీక్షలు చేయించడం, పర్యవరణ పరిరక్షణ కోసం ఏక్ థైలా - ఏక్ థాలి ప్రచారం చేసింది సంఘ్. ప్లాస్టిక్ ప్లేట్లు, పాలిథిన్ బ్యాగుల వాడకం తగ్గించడానికి ప్రయత్నించింది. ఇవే కాదు.. సౌత్ నార్త్ విషయాలపైనా సంఘ్ రియాక్ట్ అయింది. ఇది రాజకీయంగా ప్రేరేపితమైన విషయమన్నది. అలాగే మాతృభాష విషయంలోనూ స్పష్టత ఇచ్చింది. మాతృ భాషను విద్యలోనే కాకుండా మన దైనందిన జీవితంలోని అన్ని అంశాలలో ఉపయోగించాలన్నది ఆర్ఎస్ఎస్ మాట. మాతృ భాషపై ఆర్ఎస్ఎస్ ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించింది. బహుళ భాషలు నేర్చుకుంటే ఉపయోగమని, కెరీర్ లాంగ్వేజ్ ఇంగ్లీష్ అని నేర్చుకుంటే తప్పులేదన్నది. సో సంఘ్ మ్యాటర్ ఖుల్లం ఖుల్లాగా ఉంది.

## 400 ఎకరాలు ప్రభుత్వానివే

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులోని కేసుల్లో చట్టపరంగా గెలవడం ద్వారా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూమిపై యాజమాన్యాన్ని దక్కించుకుంది. ఆ భూమికి సంబంధించి సృష్టించే ఎటువంటి వివాదమైనా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది. సర్వేలో ఒక్క అంగుళం భూమి కూడా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (సెంట్రల్ యూనివర్సిటీ)ది కాదని తేలింది. ఈ భూమిలో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి ప్రణాళికలో ఏ చెరువు లేదు. కొత్తగా చేపడుతున్న అభివృద్ధి ప్రణాళిక అక్కడ ఉన్న రాళ్ల రూపాలను దెబ్బతీయదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చేపడుతున్న ప్రతి ప్రణాళికలో స్థానిక సుస్థిరాభివృద్ధి. పర్యావరణ అవసరాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రస్తుత ప్రాజెక్ట్ ను వ్యతిరేకించే వారంతా కొందరు రాజకీయ నాయకులు, స్థిరాస్తి వ్యాపారుల (రియల్ ఎస్టేట్) ప్రయోజనాలకు అనుగుణంగా విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచె గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నంబర్ 25 లోని 400 ఎకరాల భూమికి సంబంధించి కొన్ని మీడియా సంస్థల్లో వచ్చిన తప్పుదోవ పట్టించే కథనాలు తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీ ఐఐసీ) దృష్టికి వచ్చిన నేపథ్యంలో ఆ భూమికి సంబంధించిన వాస్తవాలు ప్రజల ముందుంచుతున్నాం.

**ఆ భూమికి సంబంధించిన చట్టపరమైన అంశాలు...**

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచె గచ్చిబౌలి గ్రామం సర్వే నంబర్ 25లోని 400 ఎకరాల భూమిని 2004, జనవరి 13వ తేదీన నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా వసతుల అభివృద్ధికి ఐఎంజీ అకడమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్‌కు మెమో నంబర్ 39612/Assn/V(2) 2003 ప్రకారం కేటాయించింది. ఐఎంజీ అకడమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్ తన ప్రాజెక్టును ప్రారంభించకపోవడంతో 2006, నవంబరు 21న నాటి రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం: 111080/S1/2003 ప్రకారం ఆ కేటాయింపును రద్దు చేసి ఏపీ యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం అండ్ కల్చరల్ డిపార్ట్‌మెంట్‌కు దానిని కేటాయించింది.

ఈ భూమి కేటాయింపులపై ఐఎంజీ అకడమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్ గౌరవ హైకోర్టులో 2006లో రిట్ పిటిషన్ నంబర్ 24781/2006 దాఖలు చేసింది. ఈ న్యాయపోరాటం సుదీర్ఘ కాలం కొనసాగింది. రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ఈ అంశాన్ని చాలా తీవ్రంగా పరిగణించింది. ఈ కేసులో (రిట్ పిటిషన్ నంబర్ 24781/2006) గౌరవ హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా 2024, మార్చి 7వ తేదీన ఉత్తర్వులు ఇచ్చింది. గౌరవ హైకోర్టు తీర్పును ఐఎంజీ అకడమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్ గౌరవ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (సీ) నంబర్ 9265/2024 ద్వారా సవాల్ చేసింది. ఈ పిటిషన్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం పోరాడింది. 2024, మే 3వ తేదీన గౌరవ సుప్రీంకోర్టు ఐఎంజీ అకడమీస్ దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. దీంతో ఆ 400 ఎకరాల భూమి ప్రభుత్వానికి దక్కింది. టీజీఐఐసీ విజ్ఞప్తి మేరకు.. శేరిలింగంపల్లి మండలం డిప్యూటీ కలెక్టర్ మరియు తహశీల్దార్ రెవెన్యూ రికార్డుల ప్రకారం కంచెగచ్చిబౌలి సర్వే నెంబర్ 25లోని 400 ఎకరాలు కంచ అస్తబల్ పోరంబోకు సర్కారీ (అంటే... ప్రభుత్వ భూమి అని) అని నిర్ధారించారు. ఆక్రమణలకు గురికాకుండా తర్వాత అభివృద్ధి పనులకు గానూ ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని వారు సూచించారు.

2022, సెప్టెంబరు 14న జారీ చేసిన జీవో ఎం.ఎస్.నంబర్ 571, రెవెన్యూ (అస్సైన్1) డిపార్ట్ మెంట్ ప్రకారం భూ కేటాయింపులకు సంబంధించిన కొత్త విధానం ఆధారంగా కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని కొలిచి హక్కులు బదిలీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ఐ అండ్ సీ విభాగం 2024, జూన్ 19న సూచించింది.

ఐటీ, ఇతర ప్రాజెక్టుల ఏర్పాటుకు తమకు ఆ 400 ఎకరాలు కేటాయించాలని టీజీఐఐసీ 2024, జూన్ 19న ప్రతిపాదనలు సమర్పించింది. ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచె గచ్చిబౌలి గ్రామం సర్వే నంబర్ 25లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమి హక్కులను టీజీ ఐఐసీకి బదలాయిస్తూ 2024, జూన్ 24న ఉత్తర్వులు జారీ చేశారు. శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు ఆ 400 ఎకరాల భూమికి సంబంధించి పంచనామా నిర్వహించి 2024, జులై 1వ తేదీన టీజీ ఐఐసీకి అప్పగించారు.

ఈ విధంగా ఆ 400 ఎకరాల భూమి ప్రభుత్వం స్వాధీనంలో ఉంది. కొన్ని మీడియాల్లో తప్పుడుగా వస్తున్నట్లు అటవీ భూమిగా లేదని రెవెన్యూ రికార్డుల్లోనూ ప్రభుత్వ భూమిగానే ఉందని స్పష్టమవుతోంది.

**యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ అధికారులతో సమన్వయంతోనే హద్దుల గుర్తింపు...**

తమకు కేటాయించిన 400 ఎకరాల భూమికి సంబంధించిన ఉమ్మడి హద్దుల గుర్తింపునకు తమ అధికారులకు సహకరించాలని కోరుతూ టీజీఐఐసీ సైబరాబాద్ జోనల్ మేనేజర్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిజిస్ట్రార్‌కు 2024, జులై 04వ తేదీన లేఖ రాశారు. టీజీఐఐసీ అధికారులు తమ బృందంతో పాటు యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిజిస్ట్రార్‌ను 2024, జులై 7వ తేదీన వ్యక్తిగతంగా కలిసి తమ ప్రాజెక్ట్ ప్రతిపాదనలను ఆయనకు వివరించారు. సర్వే నిర్వహణ విషయంపై టీజీఐఐసీ జోనల్ మేనేజర్ 2024, జులై 18న యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిజిస్ట్రార్ మెయిల్ registrar@uohyd.ac.in కు మెయిల్ చేశారు.

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిజిస్ట్రార్ సమ్మతితోనే 2024, జులై 19న యూనివర్సిటీ అధికారులు యూనివర్సిటీ రిజిస్ట్రార్, యూనివర్సిటీ ఇంజినీర్, యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, రెవెన్యూ అధికారులు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయర్ సమక్షంలో సర్వే జరిగింది. అదే రోజు హద్దులు నిర్ధారించారు. టీజీఐఐసీ అభివృద్ధి చేస్తున్న 400 ఎకరాల్లో బఫెల్లో లేక్, పీకాక్ లేక్ లేవు. కొన్ని మీడియాల్లో వీటి విషయంలో తప్పుడు వార్తలు వస్తున్నాయి.

## సీఎం గారు మీకు..

మీరు భరించేది కిలోకు రూ.10 మాత్రమే, ఈ విషయంలో మోదీ ప్రభుత్వం గొప్పదా రాష్ట్ర ప్రభుత్వం గొప్పదా, అయినా కేంద్ర సహకారంపై ఎందుకు నోరు విప్పరు. జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ ఒక్కటైనయ్.. మజ్లిస్ ను గెలిపించేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీ చేయడం లేదు. ఈ మూడు పార్టీల కుట్రలను తెలంగాణ సమాజం గమనించాలి.. 100 శాతం బీజేపీ పోటీ చేయాలన్నదే ఆలోచన త్వరలోనే పార్టీ నిర్ణయం ప్రకటిస్తుంది. గ్రూప్ 1 పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థుల్లో అభ్యంతరాలున్నాయి.. వెంటనే న్యాయ విచారణ జరపండి. మెరిట్ విద్యార్థులందరికీ న్యాయం చేయాలన్నదే బీజేపీ డిమాండ్. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ భూములను రక్షించేందుకు ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేయడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రికి కనీస మానవత్వం లేదా? హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ భూముల రక్షణ కోసం విద్యార్థులు ఆందోళన చేస్తుంటే.. వాళ్లను గొడ్డును బాదినట్లు బాదుతారా? అమ్మాయిలని చూడకుండా జుట్టుపట్టుకుని గుంజుకుపోయి చితకబాదుతారా? ఇదేం పద్ధతి? భూములు అమ్మకుంటే రాష్ట్రాన్ని పాలించే పరిస్థితి లేదా? భూములన్ని వేల కోట్లు సంపాదించి దండుకోవడమే మీ పనా? రాబోయే తరాలకు గజం భూమి కూడా ఉంచకుండా చేస్తారా? ఇదేం పాలన? అంత మాత్రాన మీరెందుకు. కేఏ పాల్ కు అప్పగించినా అదే పని చేస్తారు కదా అంటూ మండిపడ్డారు.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో విద్యార్థులపై పోలీసులు చేసిన లాఠీచార్జ్ చూసి బాధపడని వాళ్లు లేరు. ప్రతి ఒక్కరికి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. కాంగ్రెస్ వాళ్లు మాత్రం ఏదో గొప్ప పనిచేశామని అనుకుంటున్నారు. ముఖ్యమంత్రికి కనీస మానవత్వం లేనట్లుంది. సెంట్రల్ యూనివర్శిటీ భూముల రక్షణ కోసం విద్యార్థులు ఆందోళన చేస్తుంటే.. వాళ్లను గొడ్డును బాదినట్లు బాదుతారా, అమ్మాయిలని చూడకుండా జుట్టు పట్టుకుని గుంజుకుపోయి చితకబాదుతారా ఇదేం పద్ధతి, భూములు అమ్మకుంటే రాష్ట్రాన్ని పాలించే పరిస్థితి లేదా, ఈనెల జీతాలివ్వాలంటే భూములు అమ్మాల్సిందేనా, భూములన్ని వేల కోట్లు సంపాదించి దండుకోవడమే మీ పనా రాబోయే తరాలకు గజం భూమి కూడా ఉంచకుండా చేస్తారా ఇదేం పాలన, ఏబీవీపీ విద్యార్థులు ఆందోళన చేస్తుంటే రూముల్లో దూరి కొడతారా, రాత్రివేళ ఇష్టమొచ్చినట్లు కొట్టి అరాచక పాలన చేస్తారా లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి.

# సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల అరెస్టు అక్రమం

- బొచ్చు కళ్యాణ్ ఎస్ఎఫ్ఐ నాయకులు

**జయభేరి, పరకాల, మార్చి 31:**




సోమవారం పరకాల పట్టణంలో నిరసన చేస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ నియంతలాగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి నిర్భందాన్ని ప్రయోగిస్తూ అక్రమ అరెస్టులు చేస్తే ఊరుకునేది లేదనీ తెలంగాణ రాష్ట్రంలోని గత ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని లేకుండా చేసిందని, నియంతృత్వాన్ని, అహంకారాన్ని ప్రదర్శించిందని ప్రచారం చేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు అంతకంటే ఎక్కువగా తెలంగాణ రాష్ట్రంలో నిర్భందాన్ని, అహంకారన్ని ప్రదర్శిస్తున్నారు. దానిలో భాగంగానే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములని కర్పొరేట్ సంస్థలకు వేలం వేయాలనే నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గత పది రోజులుగా విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారు. ఈ ఆందోళనలు చేస్తున్న విద్యార్థుల పట్ల అలాగే యూనివర్సిటీ భూములు తీసుకోవద్దని డిమాండ్ చేస్తున్న సమాజం పట్ల అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు అత్యంత దురుత్సాహకరమైన రీతిలో వ్యవహరించి వాఖ్యలు చేశారు. ఈ రోజు ఆ నాలుగు వందల ఎకరాలలో ఏమీ లేదని నిరూపించుకోవటం కోసం అక్కడున్న ఫారెస్టును తొలగించి భూములన్నింటినీ హద్దులు లేకుండా చెరిపివేయాలనే పేరుతో జీవవైవిద్యాన్ని దెబ్బతీసేందుకు, మొక్కలను తొలగించటం కోసం జేసీబీలను బుల్డోజర్లను తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా పోలీసు బలగాలను దింపి, బారీగేట్లను ఏర్పాటు చేయటంతో విద్యార్థులు తమ భూములను కాపాడుకోవటం కోసం ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేసి సుమారు 60 మందికి పైగా రాయ్‌దుర్గ్, మాధాపూర్, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లకు తరలించారు. వారిని వెంటనే విడుదల చేయాలి లేదంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరకాల మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, పట్టణ కార్యదర్శి కోగీల సాయి తేజ, పట్టణ ఉపాధ్యక్షుడు యశ్వంత్, బొక్కల పాటి బన్నీ తదితరులు పాల్గొన్నారు.



## వివాహిత అదృశ్యం

**జయభేరి, మేడిపల్లి :**

శగ్గడి రాముడు వయసు 30 సంవత్సరాలు గత సంవత్సరం కాలం నుండి నాగర్ కర్నూల్ జిల్లా ముష్టిపాది గ్రామం పెద్ద కోటపల్లి మండలం నుండి వలస వచ్చి బోడుఉప్పల్ లో కూలి పని చేసుకుంటూ తన భార్య ముగ్గురు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. మార్చి 23 నాడు రోజు మాదిరి లాగే రాముడు తన కూలి పనికి ఇంటి నుండి ఉదయం 8 గంటలకు వెళ్లడం జరిగింది. తిరిగి సాయంత్రం ఇంటికి రాగా తన భార్య ముగ్గురు పిల్లలు కనిపించ లేదు. వెంటనే తెలిసిన వారిని అడగగా.. తన భార్య శివలీల (25) తన ముగ్గురు పిల్లలతో ఉదయం 9 గంటలకు ఇంట్లో నుండి ఎవ్వరికి చెప్పకుండా వెళ్ళిపోయినది. కావున ఇట్టి విషయంపై రాముడు మేడిపల్లి పిఎస్ లో ఫిర్యాదు చేయడం జరిగింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు మొదలు పెట్టడం జరిగింది. మేడిపల్లి పోలీస్ లు కేసు నమోదు చేసుకొని విచారణ జరపడం జరుగుతుంది.



## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ మహిళా మావోయిస్టు మృతి

**జయభేరి, దంతేవాడ, మార్చి 31:**

ఛత్తీస్‌గఢ్‌లో గత కొన్ని రోజులుగా భద్రతా సిబ్బంది, మావోయిస్టుల మధ్య కాల్పులు జరుగుతున్నాయి. తాజాగా మరోసారి ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ జరిగింది.

దంతేవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది యాంటీనక్సలైట్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో నక్సలైట్లు కాల్పులకు తెగబడ్డారు.ఈ ఎన్‌కౌంటర్‌లో మహిళా మావోయిస్టు మృతి చెందింది. మృతి చెందిన మావోయిస్టు వరంగల్‌కు చెందిన రేణుక అలియాస్ చైతి అలియాస్ సరస్వతిగా గుర్తించారు.

ఈమె మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలని.. దండకారణ్య స్పెషల్ జోన్‌లో కమిటీ సభ్యురాలిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆమె తలపై రూ.25లక్షలు ఉన్నట్లు వెల్లడించారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో భారీగా తుపాకులు, పేలుడు పదార్థాలు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

# దేవాలయ కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు

**జయభేరి, మేడిపల్లి :**



మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి ఆహ్వానం మేరకు మేడ్చల్ నియోజకవర్గం పోచారం మున్సిపాలిటీలోని ప్రతాపసింగారం గ్రామంలో శ్రీశ్రీ గుబ్బరి గట్టు మైసమ్మ ఎల్లమ్మ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవానికి హాజరై, అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్. ఈ సందర్భంగా ఆయన అమ్మవారి కృపా ఆశీర్వాదాలు కోరుతూ భక్తుల సందడి మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. భక్తుల భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రాంగణం భక్తి మయంగా మారింది. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన దేవాలయ కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బీ బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మాజీ జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి,పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అమర్ సింగ్,బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,మాజీ డిప్యూటీ మేయర్ శివ కుమార్ గౌడ్, పీర్జాదిగూడ అధ్యక్షులు తుంగతుర్తి రవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దర్గా దయాకర్ రెడ్డి,పీర్జాదిగూడ మాజీ కార్పొరేటర్లు కో ఆప్షన్ సభ్యులు,ప్రజా ప్రతినిధులు మరియు విశిష్ట వ్యక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా C.R ఎన్ క్లేవ్ కాలనీ సంక్షేమ సంఘ భవనం ప్రారంభోత్సవం

- GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి

**ఎల్బీనగర్ :**



మన్సూరాబాద్ డివిజన్, C.R ఎన్ క్లేవ్ కాలనీలో 22.00 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కాలనీ సంక్షేమ సంఘం భవనాన్ని కాలనీ వాసులతో కలిసి జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దశలవారీగా డివిజన్లో ప్రజా అవసరాల దృష్ట్యా నిర్దిష్టమైన ప్రణాళికలతో అభివృద్ధి పనులు రాజకీయాలకు అతీతంగా చేయడం జరుగుతుందని తెలిపారు. కాలనీ వాసులు సంక్షేమ భవనాన్ని తమ సొంత ఇంటిలా భావించి పూజలతో, సన్నాయి మేళంతో ఘనంగా గృహప్రవేశం చేయడం వారిని అభినందించారు. అనంతరం కాలనీ వాసులు తమ సొంత నిధులతో కాలనీ కమాన్ ను నిర్మించుకోవడం సంతోషకరమైన విషయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు బిక్షం రెడ్డి, రవీందర్ రావు, నరసింహారెడ్డి, రాజేందర్ రావు, వెంకట్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, లింగారెడ్డి, భాస్కర్, డివిజన్ బిజెపి అధ్యక్షుడు మునగాల హరీష్ రెడ్డి, పాతూరి శ్రీధర్ గౌడ్, బీమనపల్లి సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త

**జయభేరి, గజ్వేల్, మార్చి 31:**



ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఉపయోగపడతాయని టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో అమర నాగేందర్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, నంగునూరి సత్యనారాయణ, ఐవిఎఫ్ రాష్ట్ర నాయకులు పబ్బా చంద్రశేఖర్, కటకం శ్రీనివాస్, కొడిప్యాక నారాయణ,జిల్లా అధ్యక్షుడు నేతి శ్రీనివాస్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ యువజన అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్, గోలి సంతోష్, ఐవిఎఫ్ సిద్దిపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న, పట్టణ అధ్యక్షుడు కైలాస ప్రభాకర్ తో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా,

అనంతరం శ్రీ సీతారామ ఉమామహేశ్వర ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ఎన్ సీ రాజమౌళి కుటుంబ సభ్యుల సౌజన్యంతో శివాలయానికి రిచ్యువల్ బెల్ ని (గుడి గంట) బహుకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిర్మాణంలో ఉన్న శ్రీ కమలం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణ పనులను సమీక్షించారు ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. అందరికీ నూతన సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ, శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో అందరూ కోరుకున్నది నెరవేరాలని ఆకాంక్షించారు, ప్రతి ఒక్కరూ సేవా నిరతి కలిగి ఉండాలని ఎండాకాలం ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో అత్తెల్లి కిషన్, ఆదిమూలం నారాయణ, జె శేఖర్,ప్రసాద్, సామ శ్రీధర్,దొంతుల సత్యనారాయణ, సంపత్, కొమురవెల్లి ప్రవీణ్, నోముల మహేందర్, బాలేష్, సంతోష్ ,ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ నాయకులు ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

నాచారం మెయిన్ రోడ్ వద్ద DDL చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబలి సేవా శిబిరాన్ని ప్రారంభించి.. చర్లపల్లి, డా. ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని పలు నివాసాలకు వెళ్లి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. నెలరోజుల భక్తి, శ్రద్ధలతో కఠోర ఉపవాస దీక్షల అనంతరం రంజాన్ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకుంటున్న ఉప్పల్ నియోజకవర్గ ముస్లిం సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. రంజాన్ ఉపవాస దీక్షలు మనలో క్రమశిక్షణ, దాతృత్వం, ఐక్యతను పెంపొందిస్తాయి. తెలంగాణ భూమి మత సామరస్యానికి మార్గదర్శిగా నిలుస్తోంది. ప్రేమ, శాంతి, సామరస్యంతో ఈ పండుగను కుటుంబ సమేతంగా ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నాను అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్ గిరి BRS పార్టీ ఎంపీ ఇంఛార్జి రాగిడి లక్ష్మారెడ్డి, BRS గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ సమాజం మత సామరస్యానికి ప్రతీక



**జయభేరి, మేడిపల్లి :**

ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన టిపీసీసీ ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్.

రంజాన్ పండుగ పవిత్రతకు, మత సామరస్యానికి ప్రతీక అని టీపీసీసీ ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ అన్నారు. మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం శామీర్ పేట్ గ్రామంలోని తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ మెంబెర్ ముజీబుద్దీన్, మేడ్చల్‌మల్కాజిగిరి సేవాదళ్ అధ్యక్షుడు మహమ్మద్ షాఫిఉద్దీన్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో జరిగిన రంజాన్ వేడుకల్లో, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ (RTA) మెంబర్, భీమిడి జైపాల్ రెడ్డి, శామీర్పేట్ మండల్ అధ్యక్షులు వైస్ గౌడ్, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్‌గౌడ్, శామీర్పేట్ మండల్ అధ్యక్షులు వైస్ గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## పేదలపాలిట వరం సీఎం సహాయక నిధి



**జయభేరి, సైదాపూర్ :**

మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో మన ఎనుముల రేవంత్ రెడ్డి సీఎం సహాయక నిధి చెక్కులను సైదాపూర్ మండలంలోని దుద్దేనపల్లి గ్రామంలో గూళ్ల భూమయ్య 37500/, కండే అనిత 60,000/, 51,000/ , బొల్లి వెంకటేష్ 42,500/ , రొయ్యల లావణ్య 6000/ గార్లకి మొత్తం 1,97,000/ రూపాయల చెక్కులు పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు తాళ్లపల్లి చిన్న వెంకటేశం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, తాళ్లపల్లి వెంకటయ్య, చల్ల వెంకన్న, చాడ మహేందర్ రెడ్డి, చిన్నయాలం దేవేందర్ రెడ్డి, రొయ్యల శ్రీనివాస్, ఎడ్ల సురేందర్ రెడ్డి, యువజన నాయకులు ఇతరులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## విశాఖలో రంజాన్ వేడుకలు

**జయభేరి, విశాఖపట్నం:**

రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకుంటు న్నారు. విశాఖలో అన్ని మసీదుల్లో సామూహిక నమాజ్ లు చేశారు. ప్రార్థనలకు వేలాది మంది ముస్లిం లు హాజరయ్యారు.రాత్రి నెలవంక దర్శనమివ్వడంతో పవిత్ర రంజాన్ మాసం ముగింపు సూచికంగా భావించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఒకరిని ఒకరు ఆలింగనాలు చేసుకున్నారు. ప్రార్థనా స్థలాల వద్ద అధిక సంఖ్యలో ముస్లింలు చేరడం తో సందడి వాతావరణం నెలకొంది.



## మెఘా జాబ్ మేళా

- 4న జరిగే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి
- నిరుద్యోగ యువతకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు
- ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి

**జయభేరి, పరకాల, మార్చి 31:**

పరకాల నియోజకవర్గంలోని నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో పరకాల పట్టణ కేంద్ర సమీపంలోని లలిత కన్వెన్షన్ హాల్లో ఈ నెల 4వ తేదీన జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. సోమవారం సంబంధిత అధికారులతో కలిసి లలిత కన్వెన్షన్ హాల్లో జాబ్ మేళా నిర్వహించే పరిసర ప్రాంతాలను పరిశీలించి స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేసి, జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువతకు వసతులు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగులు రెజ్యూమ్, విద్యార్హతా జిరాక్సులు, ఆధార్ కార్డు, పాన్ కార్డ్, పాస్పోర్ట్ సైజు ఫోటో తీసుకురావాలని సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశ పెట్టామని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు.

## సైలాని బాబా దర్గాలో ప్రతేక ప్రార్ధనలు

- ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి



**జయభేరి, పరకాల, మార్చి 31:**

పరకాల నియోజకవర్గంలోని దామర మండలం ఒగులాపూర్ సైలని బాబా దర్గా వద్ద రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరి కొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ముస్లిం సోదర సోదరీమణులంతా రంజాన్ పండగ పర్వదిన వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని, పవిత్ర ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని అన్నారు. రంజాన్ పండుగ మానవులకు మార్గదర్శకం అని, సత్యాన్ని తెలిపే ఉపదేశం అన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని జరుపుకొని మతసామరస్యాన్ని చాటుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. రాష్ట్ర ప్రజలు, పరకాల నియోజకవర్గ ప్రజలపై అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. ముస్లిం మైనారిటీలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. మతసామరస్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన గందె సత్యానందం దంపతులు



**జయభేరి, పరకాల, మార్చి 31:**

పరకాల పట్టణంలోని శ్రీ గందె సీతారాములు కంపెనీ యజమాని గందె సత్యానందం ఉదయలక్ష్మి ఆధ్వర్యంలో శ్రీ విశ్వవసు నామ సంవత్సర ఉగాది పర్వదినమును పురస్కరించుకొని సేవా దృక్పథంతో వేసవికాలంలో మండుటెండలో బాటసారులకు వివిధ గ్రామాల నుంచి పరకాలలో పలు రకాల పనులకు విచ్చేస్తున్న రైతు సోదరులకు ప్రజలకు దాహార్తిని తీర్చుటలో తన వంతు సహాయం చేసే సదుద్దేశంతో ఉచిత చలివేంద్రమును ప్రారంభించడం జరిగింది. గత కొన్ని సంవత్సరాలుగా చలివేంద్రమును నిర్వహిస్తూ బాటసారు లకు చల్లని నీటిని అందిస్తున్నామని అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరకాల పరిసర గ్రామ ప్రజలకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఈ కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఆనందంతో సంతోషంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు శిరీష దంపతులు పాల్గొని మాట్లాడుతూ ఇలాంటి ప్రజా సేవా కార్యక్రమాలు మా కుటుంబం నుండి మరెన్నో నిర్వహిస్తామని తెలిపారు.

## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**జయభేరి, గజ్వేల్, మార్చి 31:**

గజ్వేల్ మున్సిపల్ వైస్ చైర్మన్ జకియోద్దీన్ కు సోమవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పవిత్ర రంజాన్ పండగ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త, మాజీ జెడ్పిటిసి డాక్టర్ మల్లేశం తదితరులు జకియోద్దీన్ కు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

# ఉగాది పురస్కారాలు నంది అవార్డ్ 2025 అందుకున్న కొర్ర కిషన్ నాయక్

- శ్రీ విఘ్నేశ్వర ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో 24 క్రాఫ్ట్స్ ఫిలిం ఫెస్టివల్ వారు సత్కారం
- స.హ. చట్టం రక్షణ సమితి-2005 వ్యవస్థాపకులు & రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్

**జయభేరి, దేవరకొండ :**




ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంపొందించి పరిపాలన వ్యవహారాలలో గోప్యాతను నివారించే ప్రభుత్వ పాలనా విధానాలను ప్రజల ముందు ఉంచేందుకు పౌరులకు కల్పించిన అద్భుత అవకాశమే సమాచార హక్కు చట్టం, సమాచారాన్ని ఇవ్వడం ప్రభుత్వం బాధ్యత అయితే సమాచారాన్ని పొందడం కూడా పౌరుల యొక్క హక్కు అని సమాచార హక్కు చట్టం రక్షణ సమితి2005 వ్యవస్థాపక&రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్ అన్నారు. నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం డిండి మండలం కొత్త తండా కు చెందిన కొర్ర కిషన్ నాయక్ కు శనివారం నాడు హైదరాబాదు నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ లో శ్రీ విఘ్నేశ్వర ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం రక్షణ సమితి 2005 వ్యవస్థాపకులు & రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్ కు 24 క్రాఫ్ట్స్ ఫిలిం ఫెస్టివల్ & ఉగాది పురస్కారాలు అవార్డు2025 ను సొసైటీ ఫౌండర్&చైర్మన్ సినిమా యాక్టర్ల చేతులు మీదుగా నంది అవార్డును అందుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజ పరిరక్షణ కోసం సమాజంలోని సామాన్య ప్రజలకు ప్రతి ఒక్కరికి ప్రశ్నించే అధికారం ఉండాలన్న ఆకాంక్షతో గత కొన్ని సంవత్సరాలుగా ప్రజల కోసం ప్రశ్నిస్తూ ప్రతి ఒక్క ప్రభుత్వ అధికారి ప్రజల కోసమే పని చేయాలని ప్రజల కోసమే చట్టాలు రూపొందించబడ్డాయని అని ప్రజల కోసమే తాను పని చేస్తున్నాన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సమాచార హక్కు చట్టం పై 10 సంవత్సరాలుగా అవగాహనా కలిపిస్తూ,సోషల్ వర్కర్ గా పనిచేస్తూ నవ శకానికి నాంది పలుకుతూ సరికొత్త ఆలోచనలతో ప్రజల సమస్యల పరిష్కారానికై పాటుపడుతూ కులమతాలకు అతీతంగా రాజు బీద తేడా చూపక నిజాన్ని నిగ్గు తేల్చడానికి ముందుకెళ్తున్నామని అని ఆయన అన్నారు.ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారితనంగా పారదర్శకంగా ఉండాలని పార్లమెంటు ద్వారా సమాచార చట్టాన్ని తీసుకురావడం జరిగిందని ప్రజాస్వామ్య భారతదేశంలో సమాచారం తెలుసుకునే హక్కు సామాన్యుని రాజ్యాంగబద్ధమైన హక్కుగా పరిగణిస్తున్న సందర్భంలో భారత దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సమాచార హక్కు చట్టంపై ప్రజలు మరింత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారన్నారు. ఈ అవార్డుతో నాకు మరింత బాధ్యత పెరిగిందని ఈ అవార్డు స్ఫూర్తితోనే మరింత ముందుకెళ్తూ ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తానని ఆయన పేర్కొన్నారు.

# ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు

- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**జయభేరి, దేవరకొండ :**



రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని నేడు దేవరకొండ పట్టణ పరిధిలోని ఈద్గా మైదానం వద్ద ముస్లిం మైనార్టీ సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి,ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ పర్వదినం శుభాకాంక్షలు తెలిపిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో చిన్నపిల్లల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయమన్నారు. రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు.

ఆ అల్లా ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ముస్లిం మైనార్టీలు తన జీవితాన్ని సౌధాన్ని సత్యం, న్యాయం, ధర్మం అనే పునాదుల మీద నిర్మింప చేసుకునేందుకు ఉపయోగపడే సాదరమే ఉపవాస వ్రతమని ఎమ్మెల్యే అన్నారు. మత సామ్రాస్యతను పెంపొందించే పండుగ రంజాన్ అని, మైనార్టీ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు అందరూ అద్భుతంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్,మున్సిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, వడ్త్య దేవేందర్ నాయక్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల్ల వెంకటయ్య గౌడ్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ రహత్ అలీ,PACs చైర్మన్లు డాక్టర్ వేణుధర్ రెడ్డి,శ్రీశైలం యాదవ్, సిపిఐ రాష్ట్ర నాయకులు పల్లా నర్సింహా రెడ్డి,పట్టణ మాజీ సర్పంచ్ పున్న వేంకటేశ్వర్లు,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యూనుస్, మాజీ జడ్పీటీసీ అరుణ సురేష్ గౌడ్,ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీమొద్దీన్, కార్యదర్శి ఇలియాజ్ పటేల్, ఉపాధ్యక్షులు ఖదీర్, యండి సబీర్, ఎలియజ్ బాబా, SK బురానోద్దీన్,మాజీ ఎంపీపీలు జాని యాదవ్, ఏడ్పుల గోవింద్ యాదవ్,బిక్కు నాయక్,సీనియర్ నాయకులు తిపర్తి రూక్మా రెడ్డి, హన్మంతు వెంకటేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య,మాజీ కౌన్సిలర్లు భూదేవి సైదులు, రైస్, తౌఫీక్,యూత్ కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నమాజ్ లో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు

- కట్కూరి దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు

**జయభేరి, పరకాల, మార్చి 31:**



పవిత్రమైన రంజాన్ పండుగను పురస్కరించుకుని, పరకాల పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు నిర్వహించిన ప్రత్యేక నమాజ్ ప్రార్థన కార్యక్రమంలో పరకాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేసి, పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పరకాల మండల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ అనేది నిస్వార్థతకు, ఉపవాసానికి, ఆధ్యాత్మిక నియమనిష్టలకు ప్రాతినిధ్యం వహించే పవిత్రమైన సమయం. ఈ నెల మనలో సహనాన్ని పెంపొందించి, దయా కరుణలను నింపుతుంది. అన్ని మతాల మధ్య స్వార్థం భౌతికాభివృద్ధి కన్నా మానవత్వం ప్రధానమని ఈ పండుగ గుర్తు చేస్తుందిఅని అన్నారు. మీ కుటుంబాల్లో ఆనందం, శాంతి, ఆయురారోగ్యాలు నిండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానుఅని అన్నారు. ప్రతి ఒక్కరికి మతభేదాలు లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేరేలా నా వంతు కృషి కొనసాగుతుంది అని అన్నారు. అందరి ఆశీర్వాదాలతో ప్రజాసేవ నిరంతరం సాగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవేందర్ రెడ్డి తో పాటుగా సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ, పరకాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్, కుంకుమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి, మాజీ సర్పంచ్ అల్లం రఘునారాయణ, కాంగ్రెస్ నాయకులు పసుల రమేష్, బండి సదానందం, మార్క రఘుపతి గౌడ్, మైనార్టీ సెల్ నాయకులు ఎండి రంజాన్ అలీ, మాజీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులు ఎండి అలీ, పబ్బ శ్రీనివాస్, ఎండి సాబీర్, కోడేపాక ఐలయ్య, నల్లెల్ల అనిల్, ఏకు రాజు, చందుపట్ల రాఘవరెడ్డి, బొచ్చు జెమిని, పరకాల మండల, పట్టణ మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శామీర్ పేటలో ఘనంగా రంజాన్ వేడుకలు

- ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లిం సోదరులు

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 31:**



శామీర్ పేట్ లో రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండే స్థానిక ఈద్గాలో ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించారు. అయితే రంజాన్ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా రంజాన్ పండగ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఆర్ వెంకట గోపాల్ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనల అనంతరం మాజీ సర్పంచ్ బత్తుల కిషోర్ యాదవ్ సీనియర్ ఉద్యమ కారులు కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ నివాసానికి వెళ్లి అఫ్జల్ ఖాన్ కు శాలువా కప్పి సన్మానించారు.

ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతు పండుగలు ఏవైనా కుల మత భేదం లేకుండా సోధర భావంతో జరుపుకోవడం సంతోషకరమని, తెలంగాణలో అనాదిగా వస్తున్న గంగా జమున కల్చర్ ను మరింత బలోపేతం చేయటం జరుగుతుందని తెలిపారు.

ఈ వేడుకల్లో మాజీ సర్పంచ్ బత్తుల కిషోర్ యాదవ్, మాజీ మండల అధ్యక్షులు విలాసాగరం సుదర్శన్, హజ్ కమిటీ మెంబర్ మహ్మద్ ముజీబుద్దీన్, చాంద్ పాషా, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఐలయ్య యాదవ్, షఫీయోద్దిన్, ఇస్మాయిల్ ఖాన్, మహ్మద్ నిసార్ అహ్మద్ ఖాన్, ఉమ్మర్,షోయబ్, నజామ్, మహ్మద్ ఆజం, అరాఫత్, నాసర్ అలీ, ఇమ్తియాజ్ అహ్మద్, అజ్మత్, జి.శ్రీనివాస్, గొలుసుల విష్ణు, ఉబేద్,డి నరేష్, పసుపుల నర్సింహా, సునీల్ రెడ్డి, బాబు, సూరి, తదితరులు పాల్గొని అలయ్ బలయ్ తో ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.



## పేదలకు సన్న బియ్యాం పంపిణీ కాంగ్రెస్ ప్రభుత్వ ఘనతే..!

- ఉగాది, రంజాన్ పర్వదినాన అమలు
- మైనార్టీల సంక్షేమానికి కట్టుబడిన కాంగ్రెస్ సర్కార్

**జయభేరి, గజ్వేల్, మార్చి 31:**

యూపీఏ చైర్ పర్సన్ సోనియాగాంధీ ఆదేశాలతో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆహార భద్రతా చట్టం అమలు చేయగా, నేడు రాష్ట్రంలోని పేదలందరికీ సన్న బియ్యం పంపిణీ కాంగ్రెస్ ప్రభుత్వ ఘనతే అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. రంజాన్ పర్వదిన సందర్భంగా మైనార్టీలకు పండగ శుభాకాంక్షలు తెలుపుతూ, సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అట్టడుగు నిలిచిన మైనార్టీల అభ్యున్నతికి కట్టుబడి పని చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కాగా రాష్ట్ర చరిత్రలో సన్న బియ్యం పంపిణీ పథకం చారిత్రాత్మకం కానుండగా, దివంగత ప్రధాని ఇందిరాగాంధీ వెట్టి చాకిరి విముక్తి పథకం, ఆలాగే కూడు, గుడ్డ, ఇల్లు లక్ష్యంతో పేదలను తీర్చిదిద్దునట్లు స్పష్టం చేశారు. సామాజిక న్యాయం లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తూ పథకాలను నేరుగా వర్తింపజేస్తున్నట్లు చెప్పారు. అయితే గత కెసిఆర్ ప్రభుత్వ హయాంలో బియ్యం మాఫియా ఇష్టారాజ్యంగా మారగా, సాక్షాత్తు అప్పటి ఎమ్మెల్యేలు సీఎంఆర్ ధాన్యం, బియ్యాన్ని పక్కదారి పట్టించినట్లు ఆరోపించారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ 10665 కోట్లు వెచ్చిస్తూ 2 కోట్ల 85 లక్షల మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుస్తున్నట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు త్వరలోనే అందించనున్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో పేదలకు గూడు కల్పించే లక్ష్యంతో రూ 5 లక్షల వ్యయంతో ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. 6 గ్యారంటీల అమలు, పంట రుణమాఫీ వంటి సాహసోపేత నిర్ణయాలతో సీఎం రేవంత్ రెడ్డి ప్రజల మన్ననలు పొందుతుండగా, ఉగాది, రంజాన్ పర్వదిన సందర్భంగా పేదలందరికీ సన్నబియ్యం పంపిణీ చేపట్టడం పట్ల పేదల నుండి హర్షం వ్యక్తం అవుతుందని అన్నారు. అలాగే గజ్వేల్ పట్టణంలో మజీద్ కమిటీ చైర్మన్ మతీన్ మరియు ఇతర మైనార్టీ పెద్దలు, ముస్లిం సోదరులకు ఆయన రంజాన్ పండగ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.


## ఉత్తరాంధ్రకు భారీ పెట్టుబడులు

**జయభేరి, విశాఖపట్నం:**

యువత కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తపన పడుతున్నారని,ఉత్తరాంధ్రకు భారీ పెట్టుబడు లు వస్తాయని తెలిపారు మంత్రి నాదెండ్ల మనోహర్.విశాఖపట్నంలో ఆయన మాట్లాడుతూ.. ఉపము ఖ్యమంత్రి పవన్ కల్యాణ్కు ఉత్త రాంధ్ర యువతకు ఉపాధి కల్పిం చాలని తపన పడుతున్నతారు.. ఉత్తరాంధ్రకు భారీ స్థాయిలో పెట్టుబడులు వస్తాయనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.. దీపం పథకం 2, లో భాగంగా 99 లక్షల మంది లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ అందించాము. గతంలో ఎప్పుడు లేని విధంగా ధాన్యం కొనుగోలు చేసి 24 గంటలలో రైతులకు డబ్బులు అందించాం.. మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నాం.. పవన్ కల్యాణ్ గిరిజన గ్రామాలలో పర్యటించి రోడ్లకు శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

# ఇక ఏడాదికి రెండు సార్లు పరీక్షలు

జయభేరి, న్యూఢిల్లీ మార్చి 31:



సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌సీబీఎస్‌ఈ విద్యార్థులకు షాకిచ్చేలా నిర్ణయాన్ని ప్రకటించింది. 2025, 26 విద్యా సంవత్సరానికి 10 నుంచి ఇంటర్ వరకు కొత్త సిలబస్‌ను విడుదల చేసింది. విద్యార్థులు, తల్లిదండ్రులు మారిన పాఠాలను బోర్డు అకాడమిక్ వెబ్ సైట్‌లో చూడవచ్చు. అయితే 10వ తరగతి విద్యార్థులకు ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది.2025, 26 విద్యా సంవత్సరానికి సంబంధించి సీబీఎస్‌ఈ కొత్త సిలబస్‌ను ముద్రించినట్టు తెలిపింది. ఇకపై పదో తరగతి పరీక్షలు ఏడాదికి రెండుసార్లు జరుగుతాయన్నారు. ఫిబ్రవరి ఒకసారి, ఏప్రిల్‌లో మరోసారి విద్యార్థులు పరీక్షలు రాసే అవకాశాన్ని కల్పిస్తున్నట్టు తెలిపింది. 2026 ఫిబ్రవరి 17న బోర్డు ఎగ్జామ్స్ రాయాల్సి ఉంటుందని తెలిపింది.పదో తరగతి పరీక్షలో 80 మార్కులకు ఉంటుంది. మిగిలిన 20 మార్కులు అంతర్గత మదింపుకు ఆధారంగా కేటాయిస్తారు. ప్రతి పరీక్షలో కనీసం 33 మార్కులు విద్యార్థులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఒకప్పుడు మార్కులు ఇచ్చేవారు. దానికి అనుగుణంగా 9 పాయింట్ల గ్రేడ్ విధానాన్ని అమలు చేయనుంది. ఇంటర్‌లో 9 పాయింట్ల గ్రేడ్ విధానం అమలుకానుంది.ఇంటర్ విద్యార్థులకు మాత్రం ఏడాదికి ఒక్కసారి పరీక్షలు రాయనున్నారు. సీబీఎస్‌ఈ ఇంటర్ సెకండ్ ఇయర్ బోర్డు పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 17 నుంచి ప్రారంభమవుతాయని తెలిపింది. దాదాపు 20 లక్షల మంది విద్యార్థులు హాజరవుతారని బోర్డు ఓ అంచనా వేసింది. 9 నుంచి ఇంటర్ వరకు అకాడమిక్ కంటెంట్, పరీక్షల సిలబస్, అభ్యసన ఫలితాలు, సిఫార్సు చేసిన బోధనా పద్ధతులు, పాఠ్య ప్రణాళిక సమగ్ర మార్గదర్శకాలను అందిస్తుందని డైరెక్టర్ వెల్లడించారు.భాషా సబ్జెక్టుల పై స్పష్టత ఇచ్చింది సీబీఎస్‌ఈ. టెన్త్‌లో ఇంగ్లీష్‌లేదా హిందీ భాషలను ఎంచుకోవాలని స్పష్టం చేసింది. తొమ్మిది లేదా 10వ తరగతిలో ఈ రెండు భాషల్లో ఒక దాన్ని విద్యార్థులు ఎంచుకోవాలి. ఈ మార్పులు విద్యార్థులు తమ ఆలోచనా సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. అలాగే ఆవిష్కరణాత్మకంగా, సృజనాత్మకంగా, సాంకేతికంగా కూడా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందన్నది బోర్డు మాట.ఇంటర్ ఫస్టియర్ పరీక్ష తర్వాత బోర్డు ఉత్తీర్ణత పత్రాలను జారీ చేయదు. విద్యార్థులు రెండో పరీక్షకు హాజరు కాకపోతే 11వ తరగతి ప్రవేశానికి డిజిలాకర్ ద్వారా అందించిన పని తీరు వివరాలు ఉపయోగించుకోవాలి. రెండో పరీక్ష ఫలితం వచ్చిన తర్వాతే ఉత్తీర్ణత సర్టిఫికెట్లు జారీ చేస్తారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో విజయం సాధించిన వారిని 12వ తరగతిలో చేర్చుకోవచ్చు. కాకపోతే సెకండ్ ఇయర్ పరీక్షా ఫలితాల ఆధారంగా వారి ప్రవేశాలను ఖరారు చేస్తామన్నారు.బోర్డు పరీక్షల కోసం పాఠశాలలు అభ్యర్థుల జాబితాలను సమర్పించినప్పుడు పరీక్ష ఫీజును అప్పుడు డిసైడ్ చేస్తామన్నారు. నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్ 2023లోని సిఫార్సుల ప్రకారం విభిన్న అభ్యసన అవసరాలను తీర్చడానికి సరళమైన బోధనా పద్ధతులను అమలు చేయాలని పాఠశాలలకు సీబీఎస్‌ఈ సూచించింది. అభ్యసనను మరింత ఆకర్షణీయంగా అర్థవంతంగా చేయడానికి పాఠశాలలు ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం, విచారణఆధారిత విధానాలు, సాంకేతిక ఆధారిత విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రస్తావించింది.



## ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

జయభేరి, పరకాల, మార్చి 31:

పరకాల నియోజకవర్గంలోని వరంగల్ మున్సిపల్ పరిధిలోని 17వ డివిజన్ ఆదర్శనగర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు రంజాన్ పర్వదినం సందర్భంగా పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డిని హన్మకొండలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించి పూలబొకే అందచేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మైనార్టీ సోదరులకు స్వీట్లు తినిపించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. పవిత్ర పర్వదినం రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు జరుపుకునే అతి పెద్ద పండుగల్లో రంజాన్ ఒకటి. ఆధ్యాత్మిక పునరుద్ధరణ, హృదయ శుద్ధితో పాటు ఆ అల్లా కృపను పొందే పవిత్రమైన పండుగగా బావిస్తారు. ఆ అల్లా కరుణాకటాక్షాలు అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నేరశాతాన్ని అరికట్టేందుకు సిసి కెమెరాలు ఏర్పాటు

- ఎస్సై వీరభద్రరావు

జయభేరి, ముదినేపల్లి, మార్చ్ 31 :

నేరశాతాన్ని అరికట్టేందుకు ముదినేపల్లి మండలంలో 100 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన్నట్లు ఎస్సై వీరభద్రరావు అన్నారు. ముదినేపల్లి పీఎస్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదినేపల్లి వై జంక్షన్, కైకలూరు రోడ్, గురజ సెంటర్, వడాలి, సింగరాయపాలెం, కొత్తపల్లి, వైవాక ప్రధాన కుడళ్ళ, బీసీ హాస్టల్స్, పాఠశాల, కళాశాలల ముఖ్యమైన స్థలాల్లో ఈ సీసీ కెమెరాలు నిరంతరం నిఘా ఉంటుందన్నారు. నిఘా నీడలో ముదినేపల్లి మండలం ఉంటుందని శాంతిభద్రతల పరిరక్షణకు దోహద పడుతున్నాయన్నారు. ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

# రంజాన్ మాసంలోనే.. దివ్య ఖురాన్ ఆవిర్భావం

- పవిత్ర ఖురాన్ సర్వ మానవ సౌభ్రాత్వాన్ని బోధిస్తుంది
- దానధర్మాలు, జాతీయత, ధార్మికతల కలయిక రమదాన్
- ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి

జయభేరి, గజ్వేల్, మార్చి 31:



రంజాన్ మాసంలోనే దివ్య ఖురాన్ ఆవిర్భవించగా, జకాత్, జాతీయత, ఆధ్యాత్మికతలను ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ బోధిస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి పేర్కొన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈద్గా మైదాన్ లో ముస్లిం సోదరులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్ తదితరులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తో కలిసి ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్ష చేపట్టి భక్తిశ్రద్ధలతో అల్లాకు కృతజ్ఞతగా ప్రార్థనలు నిర్వహించి దానధర్మాలు చేయడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఏ మతానికి చెందిన పండగలైనా మానవహితాన్ని బోధించే సందేశం దాగి ఉంటుందని, పవిత్ర ఖురాన్ కుడా అదే బోధిస్తుందని స్పష్టం చేశారు. ముస్లింలు జరుపుకునే పండుగలో రంజాన్ కు అత్యంత ప్రాధాన్యత ఉండగా, దేవుడి పట్ల కృతజ్ఞతగా ఉండి జకాత్ (దానధర్మాలు) చేయాలని ఖురాన్ బోధిస్తుందని చెప్పారు. ముఖ్యంగా మానవీయ విలువలు, పరోపకారం, సహనం, త్యాగం, కరుణ, దయార్థ హృదయం, సమానత్వం, సామరస్య వాతావరణం, జాతీయతలను రంజాన్ మాసం సూచిస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని సోదర భావంతో ప్రతి ఒక్కరు మెలగాలని ఆయన ఆకాంక్షించారు.

## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి



జయభేరి, గజ్వేల్, మార్చి 31:

పవిత్ర రంజాన్ పండగ పర్వదినాన్ని పురస్కరించుకొని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి ఈద్గా మైదాన్ వద్ద ముస్లిం సోదరులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. సర్వ మానవ హితాన్ని బోధించే ఖురాన్ పవిత్ర గ్రంథంగా మైనార్టీలు భావిస్తూండగా, రంజాన్ మాసంలో జకాత్ ఆచరించడం ఆనవాయితీ అని పేర్కొంటూ అల్లాకు కృతజ్ఞతగా భక్తిశ్రద్ధలతో నమాజ్ నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా రంజాన్ పండగ జాతీయత, సంస్కృతి వికాసానికి దోహదపడుతుందని తెలిపారు. దాతృత్వం, క్రమశిక్షణ, ఆధ్యాత్మికత కలయికలే రంజాన్ పండగని ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ చైర్మన్ సయ్యద్ మతీన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ వహీద్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అజహర్, మైనార్టీ నేత అజ్గర్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాములు గౌడ్, నేతలు లక్ష్మారెడ్డి, గుంటూకు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, సురేష్, నేత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు చలివేంద్రం

జయభేరి, దేవరకొండ :

వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ ఆధ్వర్యంలో నేడు స్థానిక బస్టాండ్ ఆవరణములో మేఘ చలివేంద్రంను RTC DM తల్లాడ రమేష్‌బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నరసింహ చేతుల మీదుగా ప్రారంభించబడును. వాసవి క్లబ్ 104 A IPC లు లకుమారపు మల్లయ్య సుకన్య, బెల్లిదే మాధవి రవీందర్,గోవిందు కొండయ్య శైలజ డిస్టిక్ చైర్మన్ అర్థం రమేష్ డిస్టిక్ సెక్రెటరీ నీలా సంజీవ కుమార్ REC ఆలంపల్లి పద్మ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చేదళ్ళ వెంకటేశ్వర్లు వాసవి కళ్యాణమండపం అధ్యక్షులు వాసా వెంకటేశ్వర్లు మరియు అన్ని సంఘాల అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారులు ఆర్యవైశ్య సంఘం సభ్యులు తప్పకుండా పాల్గొనగలరని వాసు క్లబ్ అధ్యక్షులు సముద్రాల సహదేవ్ తెలియజేసినారు. వాసవి క్లబ్ దేవరకొండ అధ్యక్షులు సముద్రాల సహదేవ్, కార్యదర్శి గార్లపాటి శ్రీనివాసులు కోశాధికారి ఇడుకుల పుల్లయ్య వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు గుమ్మడవెల్లి మహా లక్ష్మి కార్యదర్శి వీరమల్ల భాగ్యమ్మ కోశాధికారి శిలా చంద్రకళ ఆదోనిలో నిర్వహించబడును.

# బీజేపీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు

- బీజేపీ తోనే అభివృద్ధి సాధ్యం - శామీర్ పేట మండల బిజెపి అధ్యక్షుడు కొరివి కృష్ణ ముదిరాజ్

జయభేరి, శామీర్ పేట్, మర్చి 31:



బీజేపీ బలోపేతం కోసం పార్టీ నేతలు కృషి చేయాలని శామీర్ పేట మండల అధ్యక్షులు కొరివి కృష్ణ ముదిరాజ్ అన్నారు. తుర్కపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు ఎల్లు తిరుపతి రెడ్డి వారి కుమారుడు ఎల్లు వరప్రసాద్ రెడ్డి కలిసి మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తుందని అన్నారు. పార్టీకి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పార్టీ పటిష్టతకు కృషిచేస్తామని వెల్లడించారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తలకు బిజెపి అండగా ఉంటుందని కొరివి కృష్ణ ముదిరాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్ గిరి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, ఉమ్మడి శామీర్ పేట మండల వైస్ ఎంపిపి వంగరి ఉదయ్ కుమార్, కె. యాదగిరి, మైసయ్య, రాజిరెడ్డి, శ్రీనివాస్, నిరుడి అశోక్, పవన్ గౌడ్, బోయిన శివ, తుంకి భాస్కర్, శ్రీధర్ గౌడ్, తుమ్మ ఆనంద్, గౌరారం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

- చెక్కులను అందజేస్తున్న మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా



జయభేరి, ములుగు, మార్చి 31 :

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ములుగు మండల అధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనివాస్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా వారు ములుగు మండలంలోని సుమారు 3 లక్షల రూపాయల చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ములుగు మండల కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగం రాజు, మామిడ్యాల మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, గుమ్మడి కృష్ణ, ముత్యాల గౌడ్, మల్లేష్ యాదవ్ ,ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బాబు, భూమన్న, కనకరాజు ,నల్ల శీను, తుడుము గోపాల్, ముఖ్య శ్రీనివాస్, రవి ,కాంగ్రెస్ యూత్ వైస్ ప్రెసిడెంట్ సింగం స్వామి, ముఖ్య సరిత, ముఖ్య విజయమ్మ ,మర్కంటి లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సర్వ మానవ సమానత్వానికి ప్రతీక రంజాన్ పండుగ షేక్ జహంగీర్



జయభేరి, కొండమల్లేపల్లి :

నెలరోజుల భక్తిశ్రద్ధలతో కఠోర ఉపవాస దీక్షల అనంతరం కొండమల్లేపల్లి మండలం గుమ్మడవల్లి గ్రామంలో ఈద్‌ఉల్‌ఫితర్ ప్రార్థనలు ప్రశాంతంగా ముగిసాయి. ఈ సందర్భంగా గుమ్మడవల్లి పోస్ట్ మాస్టర్ షేక్ జహంగీర్ మాట్లాడుతూ, రంజాన్ ఉపవాస దీక్షలు మనలో క్రమశిక్షణ దాతృత్వం ఐక్యతను పెంపొందిస్తాయని, అల్లా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రేమ శాంతి సామరస్యంతో ఈ పండుగను కుటుంబ సమేతంగా ఆనందంగా జరుపుకోవాలని కోరారు.


పవిత్ర ఖురాన్ బోధించిన జకాత్ ఫిత్రా వంటి విలువైన సేవ నియమాలను పాటిస్తూ దాన ధర్మాలు చేస్తూ పేదల ఆకలి తీర్చే పండుగ రంజాన్ అని, గంగా జమున తహజీబ్ లా తెలంగాణలో అన్ని మతాల వాళ్ళు కలిసిమెలిసి జీవించాలని కోరారు.. నమాజ్ వేడుకల సందర్భంగా పోలీస్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మడవల్లి మత పెద్దలు సదర్ మస్కుర్ లాల్ మహమ్మద్, మౌజాం మహబూబ్ సాబ్. జానీ మియా, మోహినూద్దీన్, సులేమాన్, అబ్దుల్, నజీర్, హుస్సేన్, హుస్సేన్, అలావుద్దీన్, తయ్యాబ్, షబ్బీర్, యూసఫ్, మహబూబ్ అక్బర్, పాషా భాయ్, రసూల్, వలి, జహంగీర్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు

జయభేరి, దేవరకొండ :

బిఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ నేతృత్వంలోని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వెన్నంటే మైనారిటీలంతా ఉన్నారని దేవరకొండ మున్సిపాలిటీ 18వ వార్డు మాజీ కౌన్సిలర్, బిఆర్ఎస్ సినియర్ నాయకులు విరమోని అంజి గౌడ్ పునరుద్ఘాటించారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరసోదరీమణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ సందర్భంగా దేవరకొండ పట్టణంలోని 18వ వార్డులో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం పాటుపడుతున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని చెప్పారు. పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా నెలరోజుల పాటు ఉపవాస దీక్షలతో రంజాన్ మాసం శాంతి,ప్రేమ,దయ , సౌభ్రాతృత్వ గుణాలను పంచుతుందని,తెలంగాణలో గంగా జమునా తహజీబ్ కు రంజాన్ పర్వదినం ప్రతీక అని ఆయన తెలిపారు. మైనారిటీల సంక్షేమం కోసం కేసీఆర్ సర్కార్ అమలు చేసిన పలు పథకాలు ముస్లింల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని, గుణాత్మక ఫలితాలనిస్తున్నాయని అన్నారు. దేవరకొండ ప్రజలంతా భక్తి, శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో రంజాన్ పండుగను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి



జయభేరి, గజ్వేల్, మార్చి 31:


గజ్వేల్ మండలం అక్కరం గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు కలిసి పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట ట్రాన్స్పోర్ట్ పోలీసులు మరియు గజ్వేల్ పోలీసులు వెళ్లి రైడ్ చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 5999 వేల రూ నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడిన వారి వివరాలు మెతుకు శ్రీరాములు, పుట్ట రామరాజు, తీగుల్ వెంకట్, బోయిన స్వామి వీరందరి నివాసం మర్కుక్ మండలం గణేష్ పల్లి గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పోలీసులు మాట్లాడుతూ చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.



# క్రేజీ కాంబో మిస్సైందే..

తెలుగు చిత్రపరిశ్రమలో విక్టరీ వెంకటేశ్ క్రేజ్ గురించి చెప్పక్కర్లేదు. మాస్ యాక్షన్ అయినా.. అందమైన ప్రేమకథ అయిన అద్భుతమైన నటనతో అడియన్స్ హృదయాలు దోచేస్తుంటాడు వెంకీ. టాలీవుడ్ ఇండస్ట్రీలో ఇప్పటివరకు వెంకటేశ్ నటించిన సూపర్ హిట్ చిత్రాల్లో ప్రేమించుకుందాం రా ఒకటి. డైరెక్టర్ జయంత్ సి.పరాన్జీ దర్శకత్వం వహించిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్టైంది. ఇందులో వెంకీ జోడిగా అంజలా ఝవేరి నటించిన సంగతి తెలిసిందే. వీరిద్దరి మధ్య వచ్చే ప్రేమ సన్నివేశాలు, ప్రతినాయకుడిగా జయప్రకాష్ రెడ్డి నటన ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. అయితే ఈ సినిమాలో అంజలా ఝవేరి కంటే ముందు మరో హీరోయిన్ ను అనుకున్నారట.
ఆమె మరెవరో కాదు.. బాలీవుడ్ బ్యూటీ ఐశ్వర్య రాయ్. అంతకుముందే ఫ్యామిలీ ఫ్రెండ్స్ ద్వారా ఐశ్వర్యతో జయంత్ కు పరిచయం ఉంది. దీంతో ఆమెను ఈ సినిమాలోకి తీసుకోవాలని అనుకున్నారట. ఇక ఇదే విషయాన్ని మూవీ టీంకు చెబితే వాళ్లు నో చెప్పారట. ఎందుకంటే అప్పటికే ఆమె నటించిన రెండు మూడు సినిమాలు ఫ్లాప్ కావడంతో ఆమెకు ఐరెన్ లెగ్ అన్న ట్యాగ్ వచ్చింది. అందుకే ఆమెను కథానాయికగా తీసుకోలేదని సమాచారం. దీంతో ప్రేమించుకుందాం రా సినిమాలో ఐశ్వర్య రాయ్ స్థానంలోకి అంజలా ఝవేరిని తీసుకుంది చిత్రయూనిట్.
ఇదిలా ఉంటే..హిందీలో వరుస సినిమాలు చేస్తూ తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సంపాదించుకుంది ఐశ్వర్య రాయ్. ఆమె నటించిన చిత్రాన్ని సూపర్ హిట్ కావడంతో టాప్ హీరోయిన్ అయిపోయారు. ఆ తర్వాత నాగార్జున, జయంత్ కాంబోలో వచ్చిన రావోయి చందమామ సినిమాలో మాత్రం ఐశ్వర్య రాయ్ స్పెషల్ సాంగ్ చేశారు. ఐశ్వర్య తెలుగులో నటించిన ఏకైక సినిమా రావోయి చందమామ.

# కోలీవుడ్ స్టార్‌హీరో డైరెక్షన్‌లో?



ప్రస్తుతం రామ్‌చరణ్ 'పెద్ది' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఆ సినిమా తర్వాత ఆయన సుకుమార్ దర్శకత్వంలో సినిమా చేస్తారు. ఈ రెండు పూర్తవ్వడానికి రెండేళ్లు పట్టడం ఖాయం. అంటే.. రామ్‌చరణ్‌తో సినిమా అంటే ఏ దర్శకుడైనా రెండేళ్లు ఆగాల్సిందే. కానీ.. తమిళ హీరో ధనుష్ మాత్రం రీసెంట్‌గా రామ్‌చరణ్‌కి కథ వినిపించారట. ఆయన కథ చరణ్‌కు కూడా బాగా నచ్చిందని ఫిల్మ్ వర్గాల సమాచారం. సుకుమార్ సినిమా తర్వాత రామ్‌చరణ్ ఈ సినిమానే చేస్తారని తెలుస్తున్నది. ఒక హీరో మరో హీరోని డైరెక్ట్ చేసే ఆరోగ్యకరమైన సంస్కృతి ఇప్పుడైతే లేదు. హీరో ధనుష్ ఆ సంస్కృతికి లేటెస్ట్‌గా శ్రీకారం చుట్టారని తమిళ వర్గాలు కోడై కూస్తున్నాయి. ధనుష్ ఇప్పటివరకూ డైరెక్ట్ చేసిన కథలన్నీ సమాజంలోనుంచి తీసుకున్నవే. ఆయన సృష్టించే పాత్రలు కూడా సహజసిద్ధంగా ఉంటాయి. రామ్‌చరణ్ కెరీర్‌లో ఇప్పటివరకూ చేయనటువంటి విభిన్నమైన కథనే ధనుష్ వినిపించారని తెలుస్తున్నది. రీసెంట్‌గా ధనుష్ దర్శకత్వంలో వచ్చిన 'రాయన్' మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆయన తమిళంలో రూపొందించిన యూత్‌ఫుల్‌మూవీ 'నిలవకు ఎన్ మేల్ ఎన్నడి కోబం' సినిమా తెలుగులో 'జాబిలమ్మ నీకు అంత కోపమా'గా విడుదలైంది. ప్రస్తుతం ఆయన డైరెక్ట్ చేస్తున్న 'ఇడ్లీ కడై' సినిమా త్వరలో విడుదల కానుంది. మరి రామ్‌చరణ్‌ను ధనుష్ డైరెక్ట్ చేయనున్నారన్న వార్తలో నిజం ఎంతుందో తెలీదుకానీ.. నిజంగా అది జరిగితే అభిమానులకు పండుగే.




# ఫైర్ అవుతున్న ఫ్యాన్స్..

తెలుగు సినిమాల్లో ప్రొఫెషనల్ ప్లేయర్స్ నటించడం కొత్తేం కాదు. అప్పట్లో అశ్వినీ నాచప్ప.. ఆ తర్వాత వివిఎస్ లక్ష్మణ్.. ఇలా చాలా మంది ప్లేయర్స్ నటించారు. ఆ మధ్య వెంకటేష్ గురులో నటించిన రితిక సింగ్ కూడా ప్రొఫెషనల్ బాక్సరే. కానీ ఈ మధ్య కాలంలో ఇంటర్నేషనల్ ప్లేయర్స్ వైపు చూస్తున్నారు మన దర్శకులు. రాబిన్ హుడ్ సినిమాలో డేవిడ్ వార్నర్ నటించారు. ఈ క్యారెక్టర్ గురించి చాలా బిల్డప్ ఇచ్చారు.. పైగా ప్రమోషన్స్ కోసం బానే వాడుకున్నారు. తీరా సినిమా చూస్తే వార్నర్ పాత్రకు స్కోప్ లేదు. ఓ ఇంటర్నేషనల్ క్రికెటర్‌ను మరీ కమెడియన్‌లా చూపించారంటూ విమర్శలొస్తున్నాయి. దీనికంటే రాజమౌళితో చేసిన యాడ్ అదిరిపోయిందంటున్నారు వార్నర్ మామ ఫ్యాన్స్. రెండేళ్ల కింద మైక్ టైసన్ విషయంలోనూ పూరీ జగన్నాథ్‌పై ఇలాంటి విమర్శలే వచ్చాయి. మా సినిమాలో టైసన్ ఉన్నాడంటూ బాగా ప్రమోట్ చేసుకుంది లైగర్ టీం. తీరా సినిమా విడుదలయ్యాక చూస్తే మైక్ టైసన్‌ను చాలా దారుణంగా చూపించారంటూ ఫైర్ అయ్యారు ఆయన ఫ్యాన్స్. మొత్తానికి అప్పుడు టైసన్.. ఇప్పుడు వార్నర్.. అలా మన దర్శకుల దగ్గర బుక్ అయిపోయారు.

# నెట్టింట గ్లామర్ అరాచకం ఈ వయ్యారి..

సోషల్ మీడియాలో ప్రస్తుతం గ్లామర్ ఫోటోస్ షేర్ చేస్తూ రచ్చ చేస్తుంది ఈ హీరోయిన్. తెలుగులో ఆమె చేసిన ఫస్ట్ మూవీ డిజాస్టర్ అయ్యింది. దీంతో ఈ బ్యూటీకి అంతగా క్రేజ్ రాలేదు... కానీ నటనపరంగా మంచి మార్కులు కొట్టేసింది. ఆమె మరెవరో కాదు ఐశ్వర్య మీనన్. యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ నటించిన స్పై సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఐశ్వర్య మీనన్. ఈ సినిమాలో గ్లామర్ పరంగానే కాకుండా యాక్షన్ తోనూ మెప్పించింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. ఆ తర్వాత కొంతకాలం గ్యాప్ తీసుకున్న ఐశ్వర్య ఇప్పుడు భజే వాయువేగం సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హీరో కార్తికేయ నటించిన ఈ సినిమాకు అంతగా రెస్పాన్స్ రాలేదు. తెలుగులో ఈ బ్యూటీకి అంతగా క్రేజ్ రాలేదు. ప్రస్తుతం ఈ అమ్మడుకు తెలుగులో అంతగా అవకాశాలు రావడం లేదు. ఇదిలా ఉంటే.. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది ఐశ్వర్య. నిత్యం క్రేజీ ఫోటో షూట్స్ షేర్ చేస్తూ నెటిజన్లను ఆకట్టుకుంటుంది. ప్రతి సినిమాను తాను ఇష్టపడే చేస్తానని.. కానీ మూవీ ఫలితం అనేది తన చేతుల్లో ఉండదని తెలిపింది. తాను చేసే సినిమాలన్నీ సూపర్ హిట్ కావాలని మాత్రమే తాను కోరుకుంటానని గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది.





# ఈ మెగా హీరో 2 ఏళ్లుగా 100 స్క్రిప్ట్‌లని రిజెక్ట్ చేశాడా..

చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకొని మెగా ఫ్యామిలీ నుండి చాలా మంది హీరోలు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. పవన్ కళ్యాణ్, రామ్ చరణ్, అల్లు అర్జున్ వంటి వారు ఇప్పుడు టాప్ హీరోలుగా ఓ వెలుగు వెలుగుతున్నారు. ఇక సాయి తేజ్, వరుణ్ తేజ్, వైష్ణవ్ తేజ్ మంచి సినిమాలతో ప్రేక్షకులని అలరించాలని ఎంతో కృషి చేస్తున్నారు. అయితే వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం రావడం లేదు. అయితే ఓ మెగా హీరో రెండు ఏళ్లలో ఏకంగా 100 స్క్రిప్ట్‌లని రిజెక్ట్ చేశాడట. మరి ఆ హీరో మరెవరో కాదు వైష్ణవ్ తేజ్. ఉప్పెన సినిమాతో మంచి హిట్ కొట్టిన వైష్ణవ్ ఆ తర్వాత ఏ సినిమాతోను మెప్పించలేకపోయాడు. గత కొద్ది రోజులుగా వైష్ణవ్ తేజ్ సైలెంట్‌గా ఉంటున్నాడు. మరి అతనికి అవకాశాలు రావడం లేదా అంటే ఈ హీరో కోసం నిర్మాతలు వెయిట్ చేస్తూనే ఉన్నారు.
పెద్ద నిర్మాతలు సైతం వైష్ణవ్ తేజ్‌తో కలిసి పని చేసేందుకు ఆసక్తి చూపుతున్నారట. కాని వైష్ణవ్ తేజ్ మాత్రం ఒక్క కథకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంలేదట. కొంత మంది నిర్మాతలకు సినిమా చేస్తానని కమిట్ అయిన కథ నచ్చకపోవడంతో హోల్డ్‌లో పెడుతున్నాడట. అన్నపూర్ణ లాంటి పెద్ద బ్యానర్ లో కూడా వైష్ణవ్ తేజ్ సినిమా చేయాల్సి ఉంది. కాని ఎందుకో వైష్ణవ్ తేజ్ ఇప్పుడు ఆసక్తి చూపడం లేదు. వైష్ణవ్ తేజ్ గత రెండేళ్లలో ఏకంగా వంద కథల వరకు విన్నట్టు ఓ వార్త నెట్టింట వైరల్ అవుతుంది. అన్ని కథలు విన్నా కూడా వైష్ణవ్‌కి ఏ కథ నచ్చడం లేదా అని అభిమానులు ముచ్చటించుకుంటున్నారు. ఉప్పెన తర్వాత వైష్ణవ్ తేజ్ నటించిన కొండపొలం', 'రంగ రంగ వైభవంగా' , ఆది కేశవ' సినిమాలు డిజాస్టర్లు అయ్యాయి. ఇక 2023 చివర్లో 'ఆదికేశవ' రిలీజ్ కాగా, అది తేడా కొట్టింది. అందుకే తన తర్వాతి సినిమా విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు అర్ధమవుతుంది. మరి ఆలస్యం చేయకుండా పర్‌ఫెక్ట్ కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చి అలరించాని మెగా ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com